
సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 జూన్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల



## పార్టీలో జోష్ – ప్రత్యర్థులకు షాక్

### తెలంగాణ బిజెపిలో అమితోత్సాహం



# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:14 | 10 జూన్ 2017

## ఈ సంచికలో...


- తెలుగు పాలకులు త్వరగా మేల్కొనాలి! ...03
- విమర్శలు ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తాయి ...04
- ఉత్సాహంగా 'ఇంటింటికి మోదీ' ...06
- పార్టీలో జోష్ - ప్రత్యర్థులకు షాక్ ...07
- అవినీతిపై ఉక్కుపాదం ...13
- బిజెపి విజయాలను ప్రత్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు! ...16
- వాడవాడలా బిజెపి నేతలు ... 18
- ఇకపైన అంతా విజయమే! ...20
- జన సంఘ్ ఎందుకు? ...21
- అసాధ్యాలను సుసాధ్యం చేసిన మోదీ: అమిత్ షా ... 23
- కుట్రపూరితంగా షహరాన్‌పూర్ ఘర్షణలు ... 25
- దళితులను దగా చేసిన టీఆర్ఎస్ ... 26
- సామాన్యుడికి ఊరటనిచ్చే జీఎస్టీ ...27
- ప్రజలు కోరుకున్న తెలంగాణ బిజెపితోనే సాధ్యం ...28
- మియాపూర్ భూదందా: టీఆర్ఎస్ అవినీతికి ప్రత్యక్ష సాక్ష్యం ...30
- కేంద్ర నిధుల వివరాలు చెప్పలేకతోక ముడిచిన కేసీఆర్ ...32
- టీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం ...34


మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com
Phone No :040 24650866

Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads,
Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.

# సంపాదకీయం



## తెలుగు పాలకులు త్వరగా మేల్కొనాలి!

పోగాలము దాపురించిన వాడు అరుంధతీ నక్షత్రమును, మిత్రవాక్యమును, దీపనిర్వాణ గంధమును కనడు, వినడు, మూర్కొనడు అంటుంది పంచతంత్రం. తాత్విక అర్థాన్ని అటుంచి, వైద్యశాస్త్ర దృష్టితో చూసినా కన్ను, చెవి, ముక్కు అనే జ్ఞానేంద్రియాలు సరిగా పనిచేయని తీవ్ర అనారోగ్యానికి ఇది సంకేతం.

దేశరాజకీయాల్లో 2014లో సంభవించిన పెను మార్పుల వల్ల కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడినా, రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభల్లో బిజెపి ప్రాతినిధ్యం నామమాత్రంగా మిగిలింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెరాసకు తోడు నిల్చిన బిజెపి తెలంగాణ హితపక్షం. కాంగ్రెస్ నిర్వాకంతో అడ్డగోలుగా జరిగిన విభజన దుష్ఫలితాలకు బలికాకుండా ఆదుకుంటానని మాట ఇచ్చిన బిజెపి నవ్యాంధ్రకు మిత్రపక్షం. అలా, నవ్యాంధ్రలో మిత్రపక్షం, తెలంగాణలో హితపక్షంగా తెలుగు ప్రాంతాల అభివృద్ధి, ప్రయోజనాల పట్ల రాజకీయాలకు అతీతంగా జాతీయ దృక్పథంతో వ్యవహరిస్తున్నది బిజెపి.

తెలుగు ప్రాంతాల బిజెపి శాఖల తోడ్పాటుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నుండి మరింత సహాయ సహకారాన్ని రాబట్టి తెలుగు ప్రాంతాల ప్రగతిని పరుగులు పెట్టించడానికి పాలకులకు ఇది మంచి సానుకూల పరిస్థితి.

కాని స్వీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల యావలో పడిన తెలుగు పాలకులు రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమాలపై శీతకన్నేస్తున్నారు. పాలన వ్యవస్థలో అట్టడుగున ఉన్న గ్రామ పంచాయితి స్థాయిలో కూడా తమపెత్తనం సాగించుకోవాలన్న దుగ్ధలో పడి సంక్షేమ పథకాల అమలులో అర్హతలను ప్రక్కనపెట్టి పక్షపాత దృష్టిని ప్రోత్సహిస్తున్నారు. ఈ అప్రజాస్వామిక ధోరణి తగదని తెలుగు రాష్ట్రాల బిజెపి శాఖలు చేసిన హెచ్చరికలను తోసిపుచ్చి తెలుగు పాలకులు మిత్రవాక్యమును వినజాలని బధిరులయ్యారు.

పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు అవినీతి రహిత పాలన అందిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వంతో పోల్చిచూసుకుని తెలుగు పాలకుల పాలనలో పసలేదని తెలుగు ప్రజలు చప్పరించేస్తున్నారు. ప్రజల అసంతృప్తికి కారణాలు కనిపెట్టి దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో సైతం విఫలమైన తెలుగు పాలకులు మార్కులు, సర్వే ఫలితాలంటూ ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు.

తెలుగు నేతలు అనుమతిస్తున్నారో లేక పసిగట్టలేకపోతున్నారో గాని అవినీతి దుర్గంధం చాపకింది నీరులా సర్వత్రా వ్యాపిస్తున్నది. ప్రలోభాలతో విపక్షనేతలను లోబరచుకుని, బెదిరింపులతో విమర్శకులను, మీడియాను కట్టడి చేసి కథ సుఖాంతం చేయగలమని తెలుగు పాలకులు భ్రమలో పడినట్లుంది. దాంతో క్షేత్రస్థాయిలో గూడుకట్టుకొంటున్న ప్రజా వ్యతిరేకతను వారు దర్శించలేక పోతున్నారు.

బిజెపి అగ్రనేత స్వయంగా చూసి చేసిన హెచ్చరిక తెరాసకు రుచించలేదు. కేంద్రం అందిస్తున్న సాయంతో అమలు కావలసిన వివిధ సంక్షేమ పథకాల తీరుతెన్నులపై బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యల పట్ల తెరాస ప్రతిస్పందన దృష్టిదోషం సోకిన తెలుగు పాలకుల తత్తరపాటుకు తార్కాణం.

ప్రజాస్వామిక ధర్మాన్ని అనుసరించి విపక్షానికి చెందిన వైకాపా నేత జగన్‌కు ప్రధాని మోదీ ఇంటర్వ్యూ ఇవ్వడం పట్ల కలవరంతో కూడిన తెదేపా నేతల వ్యాఖ్యలు, దొరికిపోయిన దొంగల అపరాధ భావనకు మచ్చు తునక.

స్వజనులకు లబ్ధి, వారసులకు అధికార ప్రాప్తి చేకూర్చడం పట్ల చూపుతున్న శ్రద్ధ రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమాల పట్ల చూపితే తెలుగు పాలకులకు ఈ తత్తర, కలవరపాట్లు తప్పేవి.

తప్పులు చేయనివారికన్నా చేసిన తప్పు ఒప్పుకొని దిద్దుకున్న వారు గొప్పన్న నానుడిని మన్నించి ఘనులు అనిపించుకోడానికి సమయం తక్కువగా ఉంది కనుక తెలుగు పాలకులు త్వరగా మేల్కొనాలి!




# విమర్శలు ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తాయి

**విమర్శలు ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. 2017 మే 28న ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో ప్రసంగించిన మోదీ మూడేళ్ల పాలనపై అభినందనలతో పాటూ విమర్శలనూ స్వాగతిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంజాన్, పర్యావరణ దినోత్సవం, యోగా దినోత్సవం సహా అనేక అంశాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

- ఈ రోజు నుంచే పవిత్రమైన రంజాన్ మాసం మొదలైంది. ఈ సందర్భంగా భారత దేశంలోని, యావత్ ప్రపంచంలోని ప్రజలకూ, ప్రత్యేకంగా ముస్లిం సమాజానికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రంజాన్ నెలలో ప్రార్థనకూ, ఆధ్యాత్మికతకూ, దాతృత్వానికీ చాలా ప్రత్యేకత ఇస్తారు. మన భారతీయులందరూ గర్వించదగ్గ సంప్రదాయాన్ని మన పూర్వీకులు మనకు ఏర్పరచడం నిజంగా మన అదృష్టం.
- ప్రపంచంలోని అన్ని సంప్రదాయాలూ మన దేశంలో ఉన్నందుకు మన 125 కోట్ల మంది దేశవాసులం గర్వపడాలి. మన దేశంలో ఆస్తికులూ ఉన్నారు, నాస్తికులూ ఉన్నారు. విగ్రహారాధనను సమర్థించేవారూ ఉన్నారు, విగ్రహారాధనని వ్యతిరేకించేవారూ ఉన్నారు. ఇటువంటి సిద్ధాంతాలూ, ఇటువంటి పూజాపద్ధతులూ, ఇటువంటి సంప్రదాయమూ, మనందరికీ కలిసికట్టుగా ఉండగలిగే కళను జీర్ణించుకునేలా చేశాయి. ధర్మమైనా, సంప్రదాయమైనా, సిద్ధాంతమైనా, ఆచారమైనా మనకు ఒకే సందేశాన్ని అందిస్తాయి– అవే శాంతి, ఏకత్వం, సద్భావన. ఈ శాంతి, ఏకత్వం, సద్భావనల మార్గం ముందుకు వెళ్ళడానికి పవిత్రమైన ఈ రంజాన్ నెల సహకరిస్తుంది.
- మన దేశ చరిత్ర గురించి, మన స్వాతంత్ర సమర యోధుల గురించి, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గురించి తెలుసుకోవడానికి మన యువతరం ఆసక్తి చూపడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. లెక్కకు మించిన మహా పురుషులు వారి యవ్వనాన్ని జైళ్ళలో కోల్పోయారు. ఎందరో యువకులు ఉరిశిక్షకు గురయ్యారు. వారంతా ఎన్నో బాధలు పడ్డారు కాబట్టే ఇవాళ మనం స్వాతంత్ర్య భారతావనిలో ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో ఏ మహాపురుషులైతే జైళ్ళలో గడిపారో వారంతా చదవడం, రాయడం చేశారు. వారందరి రచనలూ కూడా భారతదేశ స్వాతంత్రానికి చాలా శక్తినిచ్చాయన్న సంగతి మనకు తెలుసు.
- చాలా ఏళ్ళ క్రితం నేను అండమాన్– నికోబార్‌కు సెల్యులార్ జైల్ చూడ్డానికి వెళ్ళాను. ఇవాళ వీర్ సావర్కర్ జయంతి. ఆయన జైల్లో 'మాజీ జన్మఠే' అనే పుస్తకాన్ని రాశారు. కవితలు రాసేవారు. గోడలపై రాసే వారు. ఆయనను చిన్న చీకటి గదిలో బంధించారు. స్వాతంత్ర్య ప్రేమికులు ఎలాంటి యాతనలు అనుభవించారో! సావర్కర్ 'మాజీ జన్మఠే' పుస్తకాన్ని నేను చదివినప్పుడు, నాకు సెల్యులర్ జైల్ చూడాలనే ఆసక్తి కలిగింది. అక్కడొక లైట్ అండ్ సౌండ్ షో కూడా జరుగుతుంది. అది చాలా ప్రేరణాత్మకంగా ఉంటుంది. స్వాతంత్ర్యం కోసం అండమాన్ జైల్లోని ఇదే సెల్యూలర్ జైల్‌లో కాలాపానీ శిక్షను అనుభవిస్తూ వారి యవ్వనాన్ని కోల్పోయిన వారు భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికి చెందిన వారు, ప్రతి భాషను మాట్లాడే వారు ఉన్నారు.
- జూన్ 5.. నెలలో ఒకటో సోమవారం. మామూలుగా అయితే ఏ ప్రత్యేకతా లేదు. కానీ, జూన్ 5 ఒక విశేషమైన రోజు. ఎందుకంటే ఆ రోజును మనం ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ ఏడాది ఐక్య రాజ్య సమితి ఈ సంవత్సరానికి నిర్దేశించిన ఇతివృత్తం 'ప్రజలను ప్రకృతితో అనుసంధానించడం'. మరొక మాటలో చెప్పాలంటే తిరిగి మూలాలకు మళ్లడం. ప్రకృతితో అనుసంధానం అవ్వడమంటే ఏమిటి? నా దృష్టిలో దీనికి అర్థం మనతో మనం కలవడం. మనతో మనం కనెక్ట్ అవ్వడం. ప్రకృతితో


మనం చేస్తున్నది పేదరికంపై పోరాటం. వారి లోపల దాగున్న ప్రతిభను జాగృతంచేసి విజయం సాధిద్దాం.

కనకట్టవ్వడమంటే, మెరుగైన భూగోళాన్ని పెంపొందించడం. ఈ సంగతిని మహాత్మ గాంధీ కన్నా బాగా ఎవరు చెప్పగలరు? మహాత్మ గాంధీ చాలా సార్లు చెప్పే వారు "ప్రతివ్యక్తీ తనకు కనిపించని ప్రపంచ క్షేమం గురించీ ఆలోచించాలి" అని. అంటే, మనం చూడని ప్రపంచాన్ని కూడా, జాగ్రత్తగా చూసుకోవాలి. మీరూ గమనించే ఉంటారు, ప్రకృతి శక్తి ఏమిటంటే బాగా అలసిపోయి వచ్చినప్పుడు ఒక గ్లాసు నీళ్ళు మొహంపై చల్లుకుంటే ఎంతో తాజాదనం వచ్చేస్తుంది. బాగా అలసిపోయి వచ్చినప్పుడు గది కిటికీలు తెరిచి, తలుపులు తెరిచి, తాజా గాలిని పీల్చుకున్నప్పుడు కొత్త చైతన్యం వస్తుంది. ఏ పంచభూతాలతో అయితే శరీరం నిర్మితమౌతుందో, ఆ పంచభూతాల స్పర్శ కలిగినప్పుడు మన శరీరంలో ఒక కొత్త ఉత్తేజం ఉత్పన్నమౌతుంది, ఒక కొత్త శక్తి కనబడుతుంది. ఇది మనకందరికీ అనుభవంలోనిదే. కానీ మనం దీనిని పట్టించుకోం. మనం దీనిని ఒక దారానికి కట్టి ఉంచం. ఒక సూత్రంతో బంధించం. మన వేదాల్లో ఈ వర్ణన లభిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే అథర్వణ వేదం మొత్తం పర్యావరణానికి చెందిన దిశానిర్దేశ గ్రంథం. దీనిని వేల సంవత్సరాలకు పూర్వమే రాశారు. "మాతా భూమి: పుత్రో అహం పృథివ్యా:" అని అంటారు. మనలోని స్వచ్ఛతకు కారణం పృథ్వి అని వేదాలు చెప్పాయి. అవని మన తల్లి, మనం ఆమె బిడ్డలం. బుద్ధ భగవానుడిని తలుచుకున్నప్పుడు వెలికివచ్చే విషయం ఏమిటంటే, ఆయన జన్మ, జ్ఞాన ప్రాప్తి, మహాపరినిర్వాణము మూడూ ఒక చెట్టు కింద జరిగాయి. మనదేశంలో కూడా ఎన్నో పండుగలూ, ఎన్నో పూజా పద్ధతులూ.. చదువుకున్నవారైనా, చదువురానివారైనా, పట్టణవాసులైనా, పల్లెవాసులైనా, ఆదివాసీలైనా, అందరికీ ప్రకృతి పూజ, ప్రకృతి పట్ల ప్రేమ సహజంగానే వారి సామాజిక జీవితంలో భాగమే. కానీ మనం ఈ విషయాన్ని ఆధునిక నిర్వచనాలతో, ఆధునిక ఆలోచనలతో జోడించాల్సిన అవసరం ఉంది.

☞ జూన్ 21 ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సుపరిచితమైన రోజు. ప్రపంచ యోగా దినోత్సవం రూపంలో యావత్ ప్రపంచం ఈ రోజును జరుపుకుంటుంది. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవంగా అచిరకాలంలోనే మూలమూలలకూ వ్యాపించి, ప్రజలను దగ్గర చేస్తోంది. ఒకవైపున ఎన్నో విచ్ఛిన్నకర శక్తులు ప్రపంచంలో తమ వికృత రూపాల్ని ప్రదర్శిస్తున్న సమయంలో, భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన ఒక గొప్ప వరం యోగా. యోగా ద్వారా యావత్ ప్రపంచాన్ని ఒక సూత్రంతో ముడిపెట్టగలిగాం. మనసును, బుద్ధిని, శరీరాన్నీ, ఆత్మనీ ఎలాగైతే కలుపుతుందో, అలాగే ఈ రోజు యోగా ప్రపంచాన్ని దగ్గరచేస్తోంది

☞ గత సంవత్సరమే నేను యోగాకు సంబంధించిన కొన్ని పోటీలను ప్రకటించాను. కొన్ని బహుమతులను ప్రకటించాను. నెమ్మది నెమ్మదిగా ఆ దిశగా పనులు ముందుకు సాగుతాయి. నాకొక సలహా వచ్చింది. ఆ మౌలికమైన సలహాను ఇచ్చిన వారిని నేనెంతో అభినందిస్తున్నాను. చాలా ఆసక్తికరమైన సలహా అది. ఈసారి మూడవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల వారు, ఒకేసారి యోగాసనాలను చేసేలాగా పిలుపునివ్వవలసిందిగా నన్ను కోరారు. అమ్మమ్మ, తాతయ్య అయినా సరే, నానమ్మ, తాతయ్య అయినా సరే,



తల్లితండ్రులైనా సరే, కొడుకులు, కూతుళ్ళైనా సరే, ఒక మూడు తరాల వాళ్ళు కలిసి యోగాసనాలు వేస్తూ ఆ ఫోటోలను అప్‌లోడ్ చెయ్యండి.

☞ ఇవాళ మరో ఆనందాన్ని కూడా మీతో పంచుకోవాలను కుంటున్నాను. "స్వచ్ఛ భారత్ ఉద్యమానికి సంబంధించి జమ్ము-కశ్మీర్‌లోని రియాసీ బ్లాక్ గురించి. రియాసీ బ్లాక్ ఆరుబయలు ప్రదేశాలలో మల మూత్ర విసర్జన రహితం అయ్యిందని నాతో చెప్పారు. రియాసీ బ్లాక్‌లోని ప్రజలందరికీ, అక్కడి పాలకులకూ కూడా జమ్ము-కశ్మీర్ ఒక మంచి ఉదాహరణను అందించింది. అక్కడి ప్రజలకు నేను అభినందనలు తెలుపుతున్నాను. ఈ మొత్తం ఉద్యమాన్ని ఎక్కువ భాగం నడిపించింది జమ్ము-కశ్మీర్‌లోని ఆ ప్రాంతానికి చెందిన మహిళలేనట. ఈ విషయంలో అవగాహనను పెంచడానికి వారు స్వయంగా దివిటీ యాత్రలు కూడా చేశారట.

☞ గత పదిహేను, నెల రోజులుగా వరుసగా వార్తాపత్రికలలోనూ, టీవీ చానల్స్‌లోనూ, సోషల్ మీడియాలోనూ, మూడేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజలు ప్రభుత్వపు లెక్కాపద్దులు చూస్తున్నారు. మూడేళ్ల క్రితం మీరు నాకు 'ప్రధాన సేవకుడి' బాధ్యతను అప్పగించారు. ఎన్నో సర్వేలూ, అభిప్రాయ సేకరణలు జరిగాయి. ఈ ప్రక్రియలన్నింటినీ నేను ఆరోగ్యకరమైన సూచనలుగా స్వీకరిస్తాను. ప్రతి పరీక్షలోనూ ఈ మూడేళ్ల కాలాన్నీ జోడించి పరీక్షించారు. సమాజంలో ప్రతి విభాగానికి చెందినవారూ దానిని విశ్లేషించారు. ప్రజాస్వామ్యంలో ఒక ఉత్తమమైన ప్రక్రియ ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని నేను స్పష్టంగా నమ్ముతాను. ప్రజలకు తమ పని గురించి లెక్కా పద్దులు ప్రభుత్వం చూపెట్టి తీరాలి. కొన్ని చోట్ల అభినందనలను అందించారు, కొన్ని చోట్ల మద్దతునిచ్చారు, కొన్ని చోట్ల లోపాలను ఎత్తి చూపారు. సమయం వెచ్చించి మా పనిని లోతుగా విశ్లేషించిన వారందరికీ నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను. కీలకమైన, ముఖ్యమైన ఫీడ్‌బ్యాక్ అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. లోటుపాట్లూ, లోపాలూ వెలుగులోకి వస్తేనే వాటిని సరిచేసుకునే అవకాశం లభిస్తుంది. విషయం మంచిదైనా, కొంచెమే మంచిదైనా, చెడ్డదైనా, ఏదైనా దాని నుండే పాఠం నేర్చుకొని, నేర్చుకొన్న దాని సాయంతోనే ముందుకు నడవాలి. నిర్మాణాత్మకమైన విమర్శ ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది. ఒక అప్రమత్త దేశానికి, ఒక చైతన్యవంతమైన దేశానికి ఈ మథనం అవసరమే.

**–జనసందేశ్ ప్రతినిధి**



# ఉత్సాహంగా 'ఇంటింటికి మోదీ'

బిజెపి సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జన్మశతాబ్ది సందర్భంగా నిర్వహిస్తోన్న కార్యవిస్తారక్ యోజన తెలంగాణలో జోరుగా సాగుతోంది. మే 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తోన్న ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి 8వేల మంది బిజెపి నాయకులు పాల్గొంటున్నారు. సుమారు 50 లక్షల కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకొని.. మూడేళ్ల మోదీ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఈ పథకాలు, కార్యక్రమాల వల్ల ప్రజల జీవితంలో వస్తోన్న సానుకూల మార్పు, జీవన ప్రమాణాలు పెరుగుతున్న వైనాన్ని వారికి తెలియచేస్తున్నారు. 'పల్లెపల్లెకి బిజెపి– ఇంటింటికి మోదీ' నినాదంతో 'ఏక్ భారత్ – శ్రేష్ట్ భారత్' లక్ష్యంగా మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకులు మొత్తం 15 రోజులు పూర్తిగా పార్టీ కోసం అంకితమయ్యారు.

మోదీ ప్రభుత్వ విజయాలతో పాటు ఏకాత్మ మానవవాదాన్ని ప్రవచించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలను, ఆలోచనలను, సూక్తులను ప్రజలకు చేర వేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పండిట్ దీన్‌దయాళ్ జీవిత చరిత్రను క్లుప్తంగా వివరించే కరపత్రాన్ని అందజేస్తున్నారు. దీంతో పాటు బిజెపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవి సాధించిన విజయాలు, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులు, మంజూరు చేసిన సంస్థల వివరాలతో కూడిన కరపత్రాలనూ పంచారు. అదేవిధంగా రాష్ట్రం టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, హామీలిచ్చి మరచిపోయిన వైనాన్ని తెలిపే కరపత్రాలనూ ఇచ్చారు. ఇంటి యజమానుల అనుమతితో దీన్‌దయాళ్‌జీ సూక్తులకు సంబంధించిన స్టిక్కర్‌ను గోడలకు అతికించారు. తెలంగాణలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. బిజెపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను స్వాగతిస్తూ, టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను తప్పుపడుతున్నారు.

### కవాడిగూడలో ప్రారంభం

మే 29న హైదరాబాద్ కవాడిగూడలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ నేతృత్వంలో ఈ కార్యవిస్తారక్ యోజన ప్రారంభమైంది. నల్లగొండ జిల్లాలో బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా లాంఛనగా ప్రారంభించిన ఈ కార్యక్రమ కొనసాగింపులో భాగంగా బండమైసమ్మ బస్తీలోని పోలింగ్ బూత్ నెం.66లో పర్యటించిన లక్ష్మణ్ మోదీ ప్రభుత్వ పథకాలు, దీన్‌దయాళ్‌జీ సాహిత్యానికి సంబంధించిన కరపత్రాలు పంచారు. 'పల్లెపల్లెకు బిజెపి – ఇంటింటికి మోదీ' నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

పార్టీ విస్తరణ కార్యక్రమాలు బూత్ స్థాయి నుండే ప్రారంభం కావాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 32 వేల పోలింగ్ బూత్‌లలో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం 106 పథకాలను ప్రవేశపెట్టి, పక్కాగా అమలు చేస్తున్నదని డా॥ లక్ష్మణ్ పేర్కొన్నారు. అమిత్ షా మూడు రోజుల పర్యటన వల్ల రాష్ట్రంలో పార్టీ ప్రజల్లోకి చొచ్చుకుని వెళ్లిందని, ప్రత్యామ్నాయ పార్టీగా బిజెపియేనని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిజెపి ఫోబియా పట్టుకుందని, అందుకే సర్వేల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, అయితే ఎంతో చైతన్యవంతులైన ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గుర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కరపత్రాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి, బిజెపి వారికి అవగాహన కల్పిస్తుందని డా॥ లక్ష్మణ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దీన్‌దయాళ్ జన్మశతాబ్ది సంచాలన సమితి చైర్మన్ డా॥ టి.రాజేశ్వర రావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దీన్‌దయాళ్ కార్యవిస్తార్ యోజన చైర్మన్ డా॥ కాసం వెంకటేశ్వర్లు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ ఇటిక్యాల లింగం, రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ వజ్జ, నగర ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**



# పార్టీలో జోష్ – ప్రత్యర్థులకు షాక్

## తెలంగాణ బిజెపిలో అమితోత్సాహం

• భువన

బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా మూడు రోజుల తెలంగాణ పర్యటన విజయవంతమైంది. మే 22 నుంచి 24 వరకు సాగిన ఈ పర్యటనతో బిజెపి రాష్ట్ర శాఖ కొత్త శక్తిని సంతరించుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ జాతీయాధ్యక్షుడు స్వయంగా ఓ పోలింగ్ కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ విజయాలను వివరిస్తే… ప్రజల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమైంది. కుల, మత, వర్ణాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలతోనూ మమేకమైన అమిత్ షా… బిజెపి అంటే ఏ ఒక్కరికో సొంతం కాదు.. ప్రజల పార్టీ అన్న సందేశమిచ్చారు.

ఈ పర్యటన ఏదో ఆషామాషీగా, తూతమంత్రంగా చేపడుతున్నది కాదని అమిత్ షా ఎంచుకున్న గ్రామాలను చూస్తే అర్థం అవుతుంది. షా సందర్శించిన ప్రతి గ్రామం ఏదో ఒక విశిష్టతను సంతరించుకుంది. దివంగత బిజెపి నేత గుండగోని మైసయ్య గౌడ్ ప్రాణాలు కోల్పోయిన థేరేట్‌పల్లి నక్సల్స్ ఘాతుకానికి ప్రతీక అయితే… గుండ్రాంపల్లి నాటి నిజాం పాలనలో రజాకార్ల రాక్షసత్వానికి సజీవ సాక్ష్యం. ఇక చిన్నమాదారం బిజెపి సర్పంచ్ నేతృత్వంలో మోదీ పథకాలు పకడ్బందీగా అమలవుతూ ప్రగతిపథంపై పరుగులెడుతోన్న ఆదర్శ గ్రామం. ఇలా చెప్పుకుంటూ పోతే అమిత్ షా పర్యటించిన ప్రతి గ్రామం, ప్రతి ప్రాంతం ఏదో ఓ విశిష్టత, విశేషాన్ని సంతరించుకున్నదే.

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్న సందేశమిస్తూ షా పర్యటన కిందిస్థాయి కార్యకర్తల్లో స్ఫూర్తి నింపింది.. ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ఉత్తేజాన్ని అందించింది.. రాష్ట్ర నాయకులకు మార్గనిర్దేశనం చేసింది.. అన్నింటికీ మించి ప్రత్యర్థులకు ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టించింది. బిజెపి తెలంగాణ శాఖ అమితోత్సాహంతో 2019 సమరానికి ఇప్పటి నుంచే సంసిద్ధమైంది.













పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి సందర్భంగా బిజెపి జాతీయ పార్టీ విస్తారక్ యోజనకు శ్రీకారం చుట్టింది. ఈ యోజనలో భాగంగా పోలింగ్ బూత్ కమిటీ సభ్యుడి నుంచి జాతీయాధ్యక్షుడి వరకు పార్టీ నాయకులు విస్తారకులుగా మారి పండిట్‌జీ సిద్ధాంతాన్ని, మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలి. ఇందులో భాగంగా బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా మే 22 నుంచి 24 వరకు తెలంగాణలో 3 రోజులు విస్తారక్‌గా పార్టీ కోసం పనిచేశారు. నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మూడు రోజుల పర్యటన నిమిత్తం మే 22న ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చేరుకున్న అమిత్ షాకు తెలంగాణ బిజెపి నేతలు ఘనస్వాగతం పలికారు. అటు నుంచి నేరుగా నల్గొండ జిల్లా థేరేట్‌పల్లికి పయనమయ్యారు. థేరేట్‌పల్లిలో బిజెపి జెండాను ఎగుర వేశారు. అనంతరం నక్సల్స్ ఘాతుకానికి బలైన దివంగత బిజెపి నేత గుండగోని మైసయ్య గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మైసయ్య గౌడ్ సేవలను అమిత్ షా స్మరించుకున్నారు.

అనంతరం ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. దీన్‌దయాళ్ జీ జీవిత చరిత్ర, మోదీ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. మోదీ పథకాలు, కార్యక్రమాలతో పేదల జీవితాల్లో వస్తున్న మార్పులు, గణనీయంగా పెరిగిన దేశాభివృద్ధి, అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత ప్రతిష్ఠను స్వయంగా వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురలీధర్ రావు, బిజెపి శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి తదితర నాయకులు వెంట ఉండి అవసరమైన చోట అమిత్ షా మాటలను ప్రజలకు తెలుగులో.. ప్రజల స్పందనను హిందీలో అమిత్ షాకు వివరించారు. దీన్‌దయాళ్ జీ సూక్తుల స్టిక్కర్లను స్వయంగా అతికించారు.



ఇంటింటి ప్రచారంలో భాగంగా అమిత్ షా అన్ని వర్గాల ప్రజలను కలిశారు. దళితులు, కార్మికులు, రైతులు, నేతన్నలు, గీత కార్మికులు, వృత్తి పనులు చేసేవారు, వ్యాపారులను.. ఎంతో మందిని కలిశారు. అందరి నుంచి అమిత్ షాకు అపూర్వ ఆదరణ దక్కింది. ఎంతో పరిచయం ఉన్న అతిథి ఇంటికి వచ్చిన చందంగా మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. తమకు వీలైనంత మేరకు అతిథి మర్యాదలు చేశారు. అటు అమిత్ షా కూడా ప్రజల నుంచి వస్తోన్న అప్యాయత, అనురాగాలకు ముగ్ధులయ్యారు.

కొందరు గ్రామస్థులు తమ సమస్యలను

## మైసయ్య గౌడ్‌కు జోహార్లు



గుండగోని మైసయ్య గౌడ్ పేద రైతింట పుట్టి, స్వశక్తితో ఉన్నత స్థానాలకు ఎదిగిన నాయకుడు. చిన్నతనం నుంచే జాతీయవాద భావాలను పునికిపుచ్చుకున్న మైసయ్య గౌడ్ ఏబీవీపీ, జనసంఘ్, బిజెపిలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఏ పదవి చేపట్టినా సమర్థంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నారు. బిజెపిలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర కార్యదర్శి పదవులు చేపట్టారు.

ప్రజాసమస్యలపైనా ఎన్నో పోరాటాలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం పాటుపడ్డారు. ఎస్సెల్బీసీ కాలువ కోసం రెండుసార్లు పాదయాత్ర చేశారు. నాయకుడిగా కన్నా ప్రజల మనిషిగానే మైసయ్య గౌడ్ పేరు సంపాదించారు. నల్గొండ జిల్లాలోనే కాదు... నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మైసయ్య గౌడ్‌ను 'బాబాయ్' అని అందరూ అప్యాయంగా పిలిచేవారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడిన వారిలో ముందువరసలో ఉంటారు. దీంతో ఇటు నక్సలైట్లకు, అటు ఐఎస్ఐ ఏజెంట్లకు లక్ష్యంగా మారారు. ఐఎస్ఐ ఏజెంట్లు రెండు సార్లు మైసయ్య గౌడ్‌పై దాడి చేశారు. తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కేంద్రమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్ల కోసం థేరేట్‌పల్లి సందర్శించిన మైసయ్య గౌడ్‌పై నక్సలైట్లు బుల్లెట్ల వర్షం కురిపించారు. 1999 మార్చి 23న వామపక్ష తీవ్రవాదుల దుశ్చర్యలకు బలై మైసయ్య గౌడ్ అమరులయ్యారు.

మైసయ్య గౌడ్ తనయుడు గుండగోని శ్రీనివాస్ గౌడ్ కూడా ఐఎస్ఐ ఏజెంట్ల దాడిలో అమరుడయ్యారు. మరో తనయుడు గుండగోని భరత్ గౌడ్ ప్రస్తుత బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణలో మైసయ్య గౌడ్ మాత్రమే కాదు... మొత్తం 55 మంది జాతీయవాదులను నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారు. థేరేట్‌పల్లిలో మైసయ్య గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించడం అంటే నక్సలైట్‌ల ఘాతుకానికి బలైన వారందరికీ నివాళులు అర్పించినట్టే. దీనిని బట్టి దేశానికి శాపంగా మారిన వామపక్ష తీవ్రవాద సమస్యపై బిజెపి ఎంత సీరియస్‌గా ఉందో అర్థం అవుతుంది.



నేను, నా దేశం – ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. – డా॥ బి.ఆర్.అంబేద్కర్

## రజాకార్ల రాక్షసత్వానికి సజీవ సాక్ష్యం



హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశత్వం, రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాత నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిది ప్రత్యేక స్థానం. నాటి హైదరాబాద్ సంస్థానంతో పాటు గుండ్రాంపల్లిలోనూ రజాకార్లు రక్తపుటేరులు పారించారు. ఖాసీం రజ్వీకి అత్యంత సన్నిహితుడైన మక్బూల్ ఈ గ్రామంలో ఎన్నో దురాగతాలకు పాల్పడ్డాడు. మక్బూల్ లెక్కలేనంత మందిని హతమార్చాడు. మహిళలను మానభంగం చేశాడు. అతని అరాచకాలు శృతిమించడంతో గ్రామస్థులంతా ఏకమై తిరగబడ్డారు. దీంతో పారిపోయిన మక్బూల్ రజాకార్ల మూకలతో తిరగొచ్చి గ్రామం మీద పడ్డాడు. 200 మంది గ్రామస్థులను హతమార్చి సమీపంలోని బావిలో పడేశారు. 100 మంది మహిళల పుస్తెలు తెంపుకొని ఎత్తుకెళ్ళిపోయారు. నిజాం నిరంకుశత్వం, రజాకార్ల రాక్షసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన గుండ్రామ్ పల్లిని అమిత్ షా సందర్శించి తెలంగాణ మనోభావాలకు పెద్దపీట వేశారు.



అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. ఓ నేత కార్మికుడి కుటుంబంలో మరుగుదొడ్లు లేకపోవడం చూసి చలించిపోయారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా నాలుగున్నర కోట్ల మరుగుదొడ్లు నిర్మిస్తే.. ఇక్కడి నేత కార్మికుల ఇంట్లో ఎందుకు లేవని ప్రశ్నించారు. తెలంగాణలో మోదీ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు మోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టి నిధులు ఇస్తుంటే వాటిని దారి మళ్లిస్తున్నారని మండిపడ్డారు. పేదలకు మోదీ పథకాలు చేరడం లేదని వాపోయారు. బిజెపి కార్యకర్తలు మోదీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.

అనంతరం థేరేట్‌పల్లిలో పోలింగ్ బూత్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రసంగిస్తూ.. పార్టీ జాతీయాధ్యక్షుడిగా తనతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, మండలాధ్యక్షుడు, గ్రామాధ్యక్షుడు, పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఒకే వేదికపై ఉండడం ఎంతో విశిష్టతను సంతరించుకుందని అన్నారు. ఇది బిజెపిలోనే సాధ్యమని స్పష్టం చేశారు. పార్టీ పని కోసం ఈ ఊరులో బిజెపి నేత మైసయ్య గౌడ్ అమరులయ్యారని, థేరేట్‌పల్లి తమకెంతో ప్రత్యేకమని అన్నారు. 11 కోట్ల మంది సభ్యులతో బిజెపి దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఘనత వహించిందని, అదేవిధంగా దేశంలో 13 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉందని స్పష్టం చేశారు. ఈ విస్తారక్ యోజన ద్వారా గ్రామగ్రామానికి వెళ్లి పార్టీని మరింత పటిష్ట పరుస్తామని అన్నారు. తెలంగాణ బిజెపి శాఖ ఎంతో కృషి చేస్తుందని కొనియాడిన అమిత్ షా.. ఇక్కడ కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ కూడా మోదీ నేతృత్వంలో అభివృద్ధి చెంది, నెంబర్ వన్ రాష్ట్రంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అనంతరం థేరేట్‌పల్లిలోని ఓ దళిత కాలనీలో అమిత్ షా సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్,



జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి తదితర బిజెపి నాయకులు కూడా పంక్తిలో కూచొని గ్రామస్థులతో కలిసి భోజనం చేశారు.

థేరేట్‌పల్లి నుంచి నల్గొండ జిల్లా కేంద్రానికి చేరుకున్న అమిత్ షా ఓ ప్రైవేట్ హోటల్‌లో మేధావులతో సమావేశమయ్యారు. మోదీ పథకాల ఉద్దేశాలను వివరించిన అమిత్ షా వారి నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించారు. అటు బిజెపి రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులతో జరిగిన సమావేశంలో తెలంగాణ పార్టీ స్థితిపై సమాలోచనలు జరిపారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పార్టీలోని వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. నల్గొండ బిజెపి జిల్లా కార్యాలయంలోనే రాత్రి నిద్రించారు.



రెండు రోజు ఉదయం నల్గొండ జిల్లా వెలుగుపల్లి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ పండిట్ దీన్‌దయాళ్ జీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఓ దళిత బస్తీకి దీన్‌దయాళ్ పేరు పెట్టారు.

అటు నుంచి చిన్నమాదారం గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామం బిజెపి సర్పంచ్ భాగ్యమ్మ నేతృత్వంలో అభివృద్ధిలో పరుగు పెడుతుంది. ఈ సందర్భంగా భాగ్యమ్మను అమిత్ షా సత్కరించారు. "చిన్న మాదారంలో బిజెపి సర్పంచ్ భాగ్యమ్మ అమలు చేసిన సంక్షేమ పథకాలు చూస్తే ఆశ్చర్యం, ఆనందం కలుగు తోంది," అని అన్నారు. పలువురు లబ్ధిదారులకు ఉజ్వల యోజన కింద మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. పేదల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం 107 పథకాలు పేదలకు చేరాలన్నారు. అప్పుడే గ్రామాలు సస్యశ్యామలమై దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. చిన్నమాదారంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. చిన్నమాదారం నుంచి పెద్దదేవులపల్లికి వెళ్లారు.

అనంతరం పెద్దదేవులపల్లిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ కూడా పాల్గొన్నారు. పెద్దదేవులపల్లిలోని ఓ పోలింగ్ బూత్ సభ్యుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గ్రామస్థులతోనూ ముచ్చటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ జాతీయాధ్యక్షుడు తమ ఊరికి రావడం, తమతో మాట్లాడడం, తమలో కలసిపోవడం చూసి గ్రామస్థులు ముగ్ధులయ్యారు. తమ సమస్యలను అమిత్ షాకు విన్నవించారు. పెద్దదేవులపల్లిలోనే సహపంక్తి భోజనాలు చేసి నల్గొండ బయలుదేరారు.

నల్గొండలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి మోదీ ప్రభుత్వ విజయాలను, రాష్ట్ర ప్రభుత్వ



## చిన్నమాదారంలో పక్కాగా మోదీ పథకాలు





మోదీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలైతే ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయన్నదానికి నల్గొండ జిల్లా చిన్నమాదారం ప్రత్యక్ష ఉదాహరణ. గ్రామాభివృద్ధి కోసం బిజెపి సర్పంచ్ పిండి భాగ్యమ్మ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేశారు. భాగ్యమ్మ కృషితో చిన్నమాదారంలో ఉజ్వల యోజనలో 100 శాతం గ్యాస్ కనెక్షన్లు అందాయి. జన్‌ధన్ యోజనలో ప్రతి ఇంటికీ బ్యాంకు అకౌంట్ ఇప్పించారు. గ్రామీణ రహదారుల నిర్మాణ పథకం కింద రోడ్ల నిర్మాణం చేపట్టారు. పెన్షన్ అందాల్సిన లబ్ధిదారులకు పెన్షన్ ఇప్పించారు. స్వచ్ఛ భారత్ కింద 584 ఇండ్లకు గాను 300 ఇండ్లల్లో మురుగదొడ్ల నిర్మాణం జరిగింది. మిగితా ఇండ్లల్లోనూ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే చిన్నమాదారం వంద శాతం మరుగుదొడ్లు ఉన్న ఘనతను సాధించనుంది.

ఇలాంటి విశేషాలున్న చిన్నమాదారం సందర్శించిన అమిత్ షా గ్రామ సర్పంచ్ భాగ్యమ్మను సన్మానించారు. పంచాయితీ రాజ్, మహిళా రిజర్వేషన్లతో గ్రామాలు శక్తిమంతం అవుతున్నాయన్నాడనికి చిన్నమాదారం ప్రబల ఉదాహరణగా పేర్కొన్నారు.



మహోద్భుతాలను సాధించడానికి దృఢ నమ్మకం మూలం. - స్వామి వివేకానంద

# పేదలకు చేరని కేంద్ర నిధులు

మే 23న నల్గొండలో అమిత్ షా ప్రెస్‌మీట్ పెట్టారు. దీనిలో అనేక అంశాలను ప్రస్తావించారు. అందులోని ముఖ్యాంశాలు చూద్దాం:

☞ గత మూడు సంవత్సరాలుగా నరేంద్రమోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం చేసినంతగా తెలంగాణకు గత 70 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేయలేదు.

☞ 13వ ఫైనాన్స్ కమిషన్ కింద కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ.9798 కోట్లు అయితే 14వ ఫైనాన్స్ కమిషన్ కింద పదింతలై దాదాపు రూ.96,706 కోట్లకు పెరిగింది.

☞ గ్రాంట్-ఇన్ ఎయిడ్ కింద 13వ ఫైనాన్స్ కమిషన్‌లో తెలంగాణకు రూ.2110 కోట్లు రాగా అదే 14వ ఫైనాన్స్ కమిషన్‌లో దాదాపు నాలుగు రెట్లు పెరిగి రూ.9900 కోట్లకు పెరిగింది.

☞ గతంలో తెలంగాణకు స్థానిక సంస్థల గ్రాంట్ కేవలం రూ.249 కోట్లు దక్కితే అదే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 33 రెట్లు పెరిగి రూ.8764 కోట్ల కేటాయింపులు జరిగాయి.

☞ తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్లు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని పేదలకు అందించడంలో విఫలమైంది.

☞ బిజెపి బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ ప్రజల ముందు నిలిచింది. అటు తెలంగాణ ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలు బిజెపికి, మోదీకి దక్కుతున్నాయి.




☞ పేదల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకరమైన పథకాలు ప్రవేశపెట్టింది. వాటి ప్రతిఫలమే గత మూడేళ్లలో దేశంలో జరిగిన ఎన్నికలన్నింటిలోనూ బిజెపి మెరుగైన స్థితిలో నిలిచింది. ఇందులో చాలావరకు బిజెపి విజయం సాధించింది.

☞ మోదీ నేతృత్వంలో గత మూడేళ్లుగా అవినీతిరహిత, నిర్ణాయాత్మక, పారదర్శక పాలన అందించాం.

☞ మోదీ ప్రభుత్వం గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా నాలుగున్నర కోట్ల మరుగుదొడ్లు నిర్మించింది. ఒక సంవత్సరంలోనే 91 లక్షల కొత్త పాన్‌కార్డులు నమోదు, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో దాదాపు 18 శాతం వృద్ధి వాటికవే రికార్డులు.



వైఫల్యాలను వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా నిధులు ఇచ్చిందని, అవేవీ పేదలకు చేరడం లేదని స్పష్టం చేశారు. అనంతరం ఓబీసీ సంఘాలు నిర్వహించిన సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు చెందిన కమిషన్‌కు రాజ్యాంగ హోదా ఇవ్వడం చారిత్రాత్మకమని ఓబీసీ సంఘాలు ప్రధాని మోదీని అభినందించారు. బిజెపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమవతుందని ఈ సందర్భంగా అమిత్ షా స్పష్టం చేశారు. రెండో రోజు పర్యటన ముగించుకొని రాత్రి నల్గొండలోనే బస చేశారు.

మూడో రోజు అమిత్ షా నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలం గుండ్రాంపల్లిని సందర్శించారు. నిజాం నిరంకుశత్వం, రజాకార్ల అఘాయిత్యాలకు గుండ్రాంపల్లి సజీవ సాక్ష్యం. ఈ గ్రామంలో రజాకార్ల దారుణాలకు ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులు అర్పించారు. వారి కుటుంబీకులను కలిశారు. నిజాం నాటి పరిస్థితులను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లోని చిత్రాలను ఆసక్తిగా వీక్షించారు. పోలింగ్ బూత్ కమిటీ సమావేశంలో ప్రసంగించారు. గుండ్రాంపల్లిలో నిజాం, రజాకార్ల అకృత్యాలు, అగడాలు తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు దేశం స్వాతంత్ర్య సంబరాలు జరుపు కొంటుంటే.. ఈ గడ్డ నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర అని చెప్పారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి 160 మంది అసువులు బాసిన గుండ్రాంపల్లిని దేశం మరచిపోదని స్పష్టం చేశారు. నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్నాటక ప్రజలు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. "బిజెపి రజాకార్లను ఎందుకు ప్రస్తావిస్తుందని కొందరు విలేకర్లతో పాటు కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు అడుగుతున్నారు... వారికి ఇదే

చెప్తున్నాను.. బిజెపి ఎప్పుడూ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పక్షమే ఉండి తీరుతుందని," అని కుండబద్దలు కొట్టారు.

ఏ తెలంగాణ కోసమైతే ప్రజలు అసమాన త్యాగాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నారో.. ఆ తెలంగాణ బిజెపితోనే, మోదీ నేతృత్వంలోనే సాకారమవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ సాకారమయ్యే వరకు బిజెపి విశ్రమించదని తేల్చి చెప్పారు. అక్కడ కార్యక్రమాలను పూర్తి చేసుకొని భువనగిరికి పయనమయ్యారు. భువనగిరిలో బిజెపి కార్యకర్తలు బైక్‌ర్యాలీలతో అమిత్ షాకు స్వాగతం పలికారు. భువనగిరిలోని ఓ దళిత కాలనీలో సహపంక్తి భోజనం చేసి, స్థానికులతో ముచ్చటించారు.

సాయంత్రం హైదరాబాద్‌కు బయలు దేరారు. కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రసంగిస్తూ... సీఎం కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి తెలంగాణకు కేంద్రం లక్ష కోట్ల రూపాయలు ఇవ్వలేదని చెప్పిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తన పర్యటనతో ప్రజల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న కేసీఆర్ ఆందోళనను ఎత్తిచూపుతూ అమిత్ షా ".. నేను విస్తారక్ యోజనలో భాగంగానే ఇక్కడికి వచ్చాను. ఎవరినీ భయపెట్టడానికి, ఓడించడానికి కాదు," అని వ్యాఖ్యానించారు. పది మందితో మొదలైన పార్టీ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని, ఇందుకు కార్యకర్తల అంకితభావం, కృషే కారణమన్నారు. పార్టీని ప్రతి బూత్‌లో



బలోపేతం చేసేందుకే విస్తారక్ యోజన చేపట్టామని, ఎవరినో బెదిరించడానికో, భయపెట్టడానికో కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ లెక్కలను తప్పుపడుతూ "నేను మరోసారి స్పష్టం చేస్తున్నాను... కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు లక్ష కోట్ల రూపాయల నిధులు విడుదల చేసింది. ఈ లెక్కలన్నీ నా దగ్గర ఉన్నాయి," అని తేల్చి చెప్పారు. 70 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయలేని పనులెన్నో బిజెపి ప్రభుత్వం చేసిందని తెలిపారు. తెలంగాణలోనూ బిజెపి విజయం తథ్యమన్న విశ్వాసం వ్యక్తం చేస్తూ "మోదీ ప్రభుత్వమేర్పడ్డాక దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. రేపు తెలంగాణలోనూ బిజెపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయం!" అని అన్నారు. ఈ కార్యక్రమంలో




కేంద్ర మంత్రులు ఎం.వెంకయ్య నాయుడు, బండారు దత్తాత్రేయ, హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్షనేత, హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో మూడు రోజులు వివిధ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న అమిత్ షా మరుసటి రోజు విజయవాడ బయలుదేరారు.

అమిత్ షా పర్యటనను విజయంతం చేసిన రాష్ట్ర శాఖపై ప్రశంసలు వెల్లువెత్తాయి. మూడు రోజుల పర్యటనలో అమిత్ షా ఎక్కడికెళ్లినా కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దీంతో 2019లోనూ విజయం పై ధీమాతో ఉన్న టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌లో గుబులు మొదలైంది. రాష్ట్రం ఇచ్చిన సెంటిమెంట్‌తో బలపడాలన్న కాంగ్రెస్ ఆశలు చచ్చిపోయాయి. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న నిధులు ప్రజలకు చేరడం లేదన్న చర్చ మొదలైంది. రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్, బిజెపి మధ్యే ప్రధాన పోరు ఉంటుందన్న భావన ఏర్పడింది. అమిత్ షా పర్యటనతో తెలంగాణలో రాజకీయ నమీకరణాలు మూర్తిగా మారిపోయాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ■



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్




# అవినీతిపై ఉక్కుపాదం

**మునుపెన్నడూ కనీవినీ ఎరుగని ఆశావహ దృక్పథం దేశమంతటా పరవళ్లు తొక్కుతోంది. సరికొత్త ఆకాంక్షలతో దేశ ప్రజ– నవ్య భారత ఆవిష్కారం దిశగా ఉరకలు వేస్తోంది. మూడేళ్లకు ముందు యూపీఏ జమానాలో సకల వ్యవస్థల సర్వభ్రష్టత్వంతో ఈసురోమన్న భారతావనికి, ఇప్పటికీ ఎంత తేడా! అటుఇటుగా పదకొండు వందల రోజుల్లో (మూడేళ్లు) కొత్త ప్రాణం పోసుకొని వ్యవస్థలన్నీ నవ చైతన్య విలసితమై వర్థిల్లుతున్నాయంటే అందుకు కారణం నీతికి నిక్కమైన కట్టుబాటు చాటుతూ సాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ పాలన! దేశాన్ని పురోభివృద్ధి బాట పట్టించేందుకు కంకణబద్ధమై ఎన్డీఏ–2 ఘనమైన ముందడుగులు వేస్తోంది. జాతి జనుల వికాసమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ఎన్నో నిర్మాణాత్మక పథకాలు కొలువు తీర్చింది. మూడేళ్ల కాలావధిలోనే అనేక రంగాల్లో అనితర సాధ్య విజయాలతో అఖండ ప్రజాభిమానాన్ని మూటగట్టుకున్న మోదీ పాలన..!**



**యం. వెంకయ్యనాయుడు**
కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

2014, మే 26... దేశం నెత్తిన కొత్త ఆశల పొద్దు పొడిచిన శుభదినం అది. అవినీతి పంకిలంలో కూరుకుపోయిన యూపీఏ పదేళ్ల పాలనకు పాతరేసి, నరేంద్ర మోదీ సారథ్యంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన భలే మంచి రోజు అది. దేశ ప్రజలు అచంచల నమ్మకంతో మోదీ సారథ్యంలోని బిజెపికి సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టి మూడు దశాబ్దాల తరవాత ఏక పార్టీ పాలనకు తెరలేపిన మహత్తర ఘడియలవి! కుంభకోణాలకు ఆలవాలమైన యూపీఏ జమానాలో అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠ అడుగంటింది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పత్తాలేకుండా పోయాయి. తోలుమందం ప్రభుత్వ ఏలుబడిలో అంతకంతకూ పెరుగుతున్న ధరల ధాటికి జనం కుదేలయ్యారు. అధికార పగ్గాలు ఎన్డీయే చేతికి వచ్చేనాటికి దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. విత్త లోటు, రెవిన్యూ లోటు, ప్రస్తుత ఖాతా లోటు, వాణిజ్య లోటు దేశాన్ని కిందకు దిగలాగాయి. అన్నింటికంటే ముఖ్యంగా యూపీఏ నాయకత్వంపై ప్రజల్లో విశ్వా సరాహిత్యం విస్తరించింది. ఈ గడ్డు సవాళ్ల నడుమ పాలన పగ్గాలు అందుకున్న నరేంద్ర మోదీ ఆర్థిక వ్యవస్థను బాగుపరచి, అంతర్జాతీయ సమాజంలో దేశ ప్రతిష్ఠను పునరుద్ధరించడాన్ని తక్షణ లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. కించిత్తు అవినీతి మరకకూ


**గడ్డు సవాళ్ల నడుమ పాలన పగ్గాలు అందుకున్న నరేంద్ర మోదీ ఆర్థిక వ్యవస్థను బాగుపరచి, అంతర్జాతీయ సమాజంలో దేశ ప్రతిష్ఠను పునరుద్ధరించడాన్ని తక్షణ లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. కించిత్తు అవినీతి మరకకూ తావులేకుండా పాలన సాగించడం మోదీ ప్రభుత్వం సాధించిన అతిగొప్ప విజయం.**

తావులేకుండా పాలన సాగించడం మోదీ ప్రభుత్వం సాధించిన అతిగొప్ప విజయం. యూపీఏ దశాబ్ది పాలనలో దారితప్పిన అధికార వ్యవస్థలకు చురుకు పుట్టించి గాడిన పెట్టాల్సిన గురుతర బాధ్యతను భుజాలకెత్తుకున్న మోదీ ఆ లక్ష్య సాధనలో కనీవినీ ఎరుగని గెలుపును సొంతం చేసుకున్నారు. జవాబుదారీ, పారదర్శక, సమర్థ వ్యవస్థలను ఆవిష్కరించి ఆయన మెరుగైన పాలనను ఆవిష్కరించారు. గ్రామాలు, పేదలు, రైతులు, మహిళలు, యువత జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్య సాధన కోసం విలక్షణమైన ఎన్నో సామాజిక సంక్షేమ పథకాలకు మోదీ శ్రీకారం చుట్టారు.




### సమర్థ పాలన– సరికొత్త ఒరవడి

దేశాభివృద్ధికోసం పునాది సంస్కరణలకు తెరచాపలెత్తిన మోదీ మరోవంక ప్రపంచ దేశాల నాయకులతో సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేసుకుని భారత ప్రతిష్ఠను ఇనుమడింపజేసే మహా ప్రయత్నాన్నీ జోరుగా ప్రారంభించారు. ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, జపాన్ ప్రధాని షింజో అబేలతో సహా వివిధ దేశాధినేతలతో నరేంద్ర మోదీ ఆత్మీయ అనుబంధం ఏర్పాటు చేసుకోగలిగారు. ఆ రకంగా అణు సరఫరా దేశాల జాబితా(ఎన్ఎస్‌జీ)లో భారత్‌కూ చోటు కల్పించేందుకు చురుగ్గా పావులు కదిపారు. భారత నౌకాదళాధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన కుల్‌భూషణ్ జాదవ్ కేసును హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం సమక్షానికి తీసుకువెళ్ళడం ద్వారా అవసరమైతే దౌత్యపరంగా అత్యంత కఠినంగా వ్యవహరించేందుకూ వెనకాడబోమన్న సంకేతాలను ప్రభుత్వం వెలువరించింది. సోషలిస్టుల కాలం నాటి ప్రణాళిక సంఘం స్థానే ప్రభుత్వానికి ప్రత్యక్షంగా విధానపరమైన దిశానిర్దేశం చేయగల మెరుగైన బృందంతో 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేయడం విప్లవాత్మక సంస్కరణ. ఇప్పటికే 'నీతి ఆయోగ్' చురుగ్గా స్పందించి దేశాభివృద్ధికి కీలకమైన మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక, ఏడేళ్ల వ్యూహాత్మక ప్రణాళిక, పదిహేను సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళిక పత్రాలను రూపొందించింది. కేంద్ర బడ్జెట్ సమర్పణ తేదీని ఫిబ్రవరి 28నుంచి ముందుకు జరిపి ఫిబ్రవరి 1గా నిర్ణయించడం మరో కీలకమైన పాలన సంస్కరణ. కొత్త ఆర్థిక సంవత్సరం నాటికి మొదలయ్యే రుతుపవనాల దృష్ట్యా నిధుల విడుదల వినియోగానికి సర్వసన్నద్ధంగా ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం




ఈ సంస్కరణ తీసుకువచ్చింది. మరోవంక ప్రత్యేక రైల్వే బడ్జెట్ పద్ధతికి స్వస్తి పలికి, దాన్ని కేంద్ర బడ్జెట్లో భాగంగా మార్చారు. ప్రణాళిక, ప్రణాళికేతర నిధుల మధ్య తేడాలను చెరిపేశారు. దీనివల్ల బడ్జెట్ కేటాయింపులను నిర్దిష్ట కాలావధిలో నిర్మాణాత్మకంగా ఖర్చుపెట్టడంతో పాటు వాటి వినియోగంలో అవసరమైన వెసులుబాటుకూ వీలు చిక్కుతుంది. రాష్ట్రాల క్రియాశీల సహకారంతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నది మోదీ ప్రభుత్వ బలమైన విశ్వాసం. మునుపటి ప్రభుత్వాలకు భిన్నంగా సిసలైన సహకార సమాఖ్య విధానాన్ని గట్టిగా నమ్మి, అమలు పరుస్తున్న ప్రభుత్వమిది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను తుచ తప్పకుండా ఆమోదించి భాగింపదగిన పన్నుల మొత్తంలో రాష్ట్రాలకు 42శాతం, స్థానిక సంస్థలకు అయిదు శాతం వాటా కేటాయించడమే ఇందుకు నిదర్శనం. 'వీఐపీ' సంస్కృతికి చరమగీతం పాడుతూ వాహనాలపై ఎర్ర బుగ్గలను నిషేధించడం పాలనను సాధ్యమైనంత మేర ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళాలన్న మోదీ ప్రభుత్వ చొరవకు దాఖలా. దేశంలోని అధికార, రాజకీయ స్థానాల్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన జడత్వాన్ని పారగొట్టి వాటిని ప్రజాశ్రేయోదాయకంగా, క్రియాశీలంగా తీర్చిదిద్దడమే ఈ సంస్కరణల ప్రధానోద్దేశం. సవాళ్లను అధిగమించి కనిష్ట ప్రభుత్వం ద్వారా గరిష్ట పాలన అందించడమే ధ్యేయంగా ఎన్డీయే-2 అత్యంత నమర్థంగా పురోగమిస్తోందనడంలో సందేహమే లేదు.

దేశ ఆర్థిక రథం సంస్కరణల పథంలో జోరుగా దూసుకుపోతోంది. ఆర్థికాభివృద్ధి సూచీలే ఇందుకు దాఖలా! జీడీపీ వృద్ధి రేటు కొత్త పుంతలు తొక్కడం, విదేశ ప్రత్యక్ష పెట్టుబడులు రికార్డు స్థాయి(60 బిలియన్ డాలర్లు)కి చేరడం, విత్తలోటు కనిష్ట స్థాయికి పరిమితమవడం, ప్రస్తుత ఖాతా లోటు దాదాపుగా కనిపించకపోవడం, అతి తక్కువ ద్రవ్యోల్బణం, రూపాయి మారకం విలువ అదుపులో ఉండటం వంటివి మోదీ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణకు సాక్ష్యాలు. పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో దేశ ఆర్థికం అదుపు తప్పుతుందని కొందరు దుష్ప్రచారం చేశారు. కానీ 2017-18 కాలానికి జీడీపీ వృద్ధి రేటు 7.40 శాతంగా ఉండనుందన్న అంచనా ప్రభుత్వ సమర్థ ఆర్థిక నిర్వహణకు అద్దం పడుతుంది. జీడీపీ వృద్ధి రేటు జోరుమీద ఉండటం, ఎఫ్డీఐల

**నల్లధనంపై 'సిట్' ఏర్పాటు, వివిధ దేశాలతో పన్నుల ఒడంబడికలకు సవరణలు చేయడం, ఆస్తుల స్వాధీనానికి వీలు కల్పిస్తూ పీఎంఎల్ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) చట్టంలో మార్పులు, బినామీ లావాదేవీల చట్టానికి సవరణలు, ఆదాయ వెల్లడి పథకం (ఐడీఎస్) వంటివి అక్రమార్జనకు ముకుతాడు వేసే క్రమంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు రుజువులు.**

పెరుగుదల, విత్త లోటు నియంత్రణలో కొనసాగడం, కనిష్ట ద్రవ్యోల్బణం వల్ల సామాజిక సంక్షేమ పథకాలకు మరిన్ని నిధుల కేటాయింపునకు, తద్వారా ఉపాధి విస్తరణకూ అవకాశం దొరుకుతుంది. జీడీపీ వృద్ధి రేటు 2012-13లో 5.48శాతం కాగా, 2013-14నాటికి అది 6.4శాతానికి, 2016-17నాటికి 7.11శాతానికి చేరడం విశేషం. ఒకవైపు అమెరికా ఆర్థిక వ్యవస్థ కేవలం మూడు శాతం వృద్ధి రేటుతో మందగమనంలో సాగుతోంది. మరోవైపు చైనాలో మాంద్యం పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులకు భారత్ అతిపెద్ద ఆకర్షణగా నిలుస్తోంది. విదేశ మారక నిల్వలు 2013 సెప్టెంబరులో 274 బిలియన్ డాలర్ల కనిష్ట స్థాయిలో ఉండగా.. కిందటినెలకు ఆ మొత్తం పెరిగి 375 బిలియన్ డాలర్లకు చేరింది. వచ్చే జులై 1 నుంచి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి రానుంది. స్వాతంత్ర్యానంతరం దేశ పన్నుల వ్యవస్థలో తీసుకువచ్చిన అతి భారీ సంస్కరణగా దీన్ని పేర్కొనవచ్చు. పన్నుమీద పన్ను చెల్లించాల్సిన పాత విధానాలకు స్వస్తి పలికి.. జీఎస్టీ ద్వారా దేశమంతటా ఒకే పన్ను పద్ధతిని అమల్లోకి తీసుకురావడం వల్ల వ్యాపారానుకూలత ఇనుమడిస్తుంది. దీర్ఘకాలంలో వ్యాపారులకూ, వినియోగదారులకూ వేలు చేకూర్చి ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుంది. అనేక నిత్యావసరాల ధరలు దిగివస్తాయి. కొన్ని రకాల ఉత్పత్తుల రేట్లు నిస్సందేహంగా పెరుగుతాయి కూడా! అయితే మొత్తంగా పన్నుల పునర్వ్యవస్థీకరణ వల్ల సామాన్యుడే తుది విజేతగా ఆవిర్భవిస్తాడనడంలో మరో మాట లేదు. అవినీతి కట్టడి, నల్లడబ్బు నియంత్రణే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన పెద్దనోట్ల రద్దుపై విపక్షాలు చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. కాలం గడుస్తున్న కొద్దీ విపక్షాలవి అర్థం లేని విమర్శలని తేటపడుతోంది. పెద్దనోట్ల రద్దు అనంతరం దేశవ్యాప్తంగా పన్నుల పరిధిలో 91లక్షలమంది అదనంగా చేరినట్లు ఇటీవల ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెలువరించిన ప్రకటన సానుకూల పరిణామం. డిజిటల్ లావాదేవీలు పెరగడం, పన్నుల పరిధి విస్తరించి రెవిన్యూ రాబడి ఇనుమడించడం వల్ల ప్రభుత్వానికి నిధులు సమృద్ధిగా దఖలుపడతాయి. ఫలితంగా నిర్మాణాత్మక కార్యకలాపాలు, అభివృద్ధి అవసరాల కోసం వ్యయం చేసేందుకు ప్రభుత్వానికి వీలు చిక్కుతుంది. పెద్దనోట్ల రద్దువల్ల ఖర్చుపెట్టే ప్రతి రూపాయీ లెక్కాపత్రాల్లో చేరుతోంది. ఫలితంగా నల్లధన ప్రవాహానికి బ్రేకులు పడటంతోపాటు.. నకిలీ కరెన్సీ ముఠాల నడ్డి విరుగుతోంది. విదేశాలకు చేరిన నల్లధనాన్ని వెనక్కి రప్పించడం, దేశంలో పన్నుల పరిధిని విస్తరించడంపై.. పాలన బాధ్యతలు స్వీకరించిన తొలి రోజునుంచీ మోదీ ప్రభుత్వం నిబద్ధ కృషి సాగిస్తోంది. నల్లధనంపై 'సిట్' ఏర్పాటు, వివిధ దేశాలతో పన్నుల ఒడంబడికలకు సవరణలు చేయడం, ఆస్తుల


సాధారణంగా విజ్ఞులు వింటారు, మేధావులు మాట్లాడుతారు, మూర్ఖులు వాదిస్తారు.

స్వాధీనానికి వీలు కల్పిస్తూ పీఎంఎల్ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) చట్టంలో మార్పులు, బినామీ లావాదేవీల చట్టానికి సవరణలు, ఆదాయ వెల్లడి పథకం (ఐడీఎస్) వంటివి అక్రమార్జనకు ముకుతాడు వేసే క్రమంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు రుజువులు. ఐడీఎస్ కింద వసూలైన రూ. 62,250 కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని పేదల సంక్షేమం కోసం వినియోగించనున్నారు. నల్లధన స్వాముల కళ్లు బైర్లు కమ్మించే కఠిన చర్యలు ఇకమీదటా ఇదే స్థాయిలో కొనసాగుతాయనడంలో సందేహం లేదు.

### పేదలకు భరోసా

నిరుపేదల జీవితాల్లో వెలుగుపూలు పూయించడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఆదివాసులు, దళితులు, మహిళలు, రైతులు, కార్మికులు, యువత, మైనారిటీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎన్నో పురోగామి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జన్‌ధన్ యోజన, ముద్ర బ్యాంకు, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన, ప్రధాన్ మంత్రి కృషి సించాయీ యోజన, భారత్‌లో తయారీ, భేటీ పఢావో-భేటీ బచావో, ప్రధాన్ మంత్రి జన సురక్ష బీమా యోజనతోపాటు ఎన్డీయే-2 ప్రవేశపెట్టిన మరెన్నో సామాజిక సంక్షేమ పథకాలు భిన్న వర్గాల సముద్ధరణ దిశగా మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనగా భాసిల్లుతున్నాయి. బ్యాంకు ఖాతాలేని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 28.56 కోట్లమందిని జన్‌ధన్ యోజన ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం, వారి ఖాతాల్లో రూ. 64.682 కోట్ల భారీ మొత్తం జమపడటం మోదీ ప్రభుత్వం సాధించిన అతిగొప్ప విజయం. ఈ ప్రయోగం సఫలం కావడంతో జన్‌ధన్-ఆధార్-మొబైల్ అనుసంధానంతో 'జామ్' దిశగా ప్రభుత్వం రెట్టించిన ఉత్సాహంతో అడుగులు వేస్తోంది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకానికి 'జామ్' కీలక ప్రాతిపదిక కానుంది. వివిధ సామాజిక సంక్షేమ పథకాల కింద, పేదలకు ప్రయోజనం చేకూర్చే క్రమంలో, ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఇప్పటికే రూ. 1.94లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేశారు. ముఖ్యంగా 'పహల్', జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, 'పీడీఎస్' పథకాల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని బదలాయించారు. దేశంలో 17కోట్ల ఎల్‌పీజీ వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో ఎల్‌పీజీ సబ్సిడీ నేరుగా జమపడుతోంది. ప్రధానమంత్రి పిలుపందుకొని 1.05కోట్ల ఎల్‌పీజీ వినియోగదారులు స్వచ్ఛందంగా సబ్సిడీ వదులుకోవడం విశేషం. తద్వారా మిగిలిన మొత్తాన్ని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అయిదు కోట్ల కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్లు ఇచ్చేందుకు వినియోగించనున్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ విధానం పారదర్శకమైంది. దీనివల్ల బోగస్ లబ్ధిదారుల ఏరివేత సులభంగా మారింది. ఈ రకంగా రూ. 50వేలకోట్ల మొత్తం ప్రభుత్వానికి మిగిలింది. గ్రామీణ విద్యుదీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం

**దేశ పౌరులందరికీ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పిస్తూ ఇదే స్థాయి దీక్షాదక్షతలతో ఇకమీదటా కదం తొక్కేందుకు మోదీ ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక సారథ్యమే స్ఫూర్తిగా పురోభివృద్ధి పథంలో సరికొత్త చరిత్రను లిఖించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం సదా ఉరకలెత్తుతూనే ఉంటుంది.**

గణనీయ విజయాలు సొంతం చేసుకొంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్డీయే దేశంలోని 18,452 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని లక్ష్య నిర్దేశం చేసుకొంది. అందులో ఇప్పటికే 13,400 గ్రామాలను విద్యుదీకరించడం విశేషం. మరోవంక ఎల్ఈడీ బల్బుల ధరలను రూ. 300 నుంచి రూ. 60కి తగ్గించడంతో దేశంలో భారీయెత్తున 23కోట్ల బల్బుల పంపిణీ జరిగింది. వీటివల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 12,000 కోట్ల మొత్తం ఆదా కానుంది. 2022నాటికల్లా అంటే 75వ స్వాతంత్ర్య దినోత్సవ సమయానికి దేశంలోని ప్రతి కుటుంబానికీ సొంత ఇంటిని ఏర్పరచాలన్నది మోదీ ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ విషయంలో యూపీఏ పదేళ్ల హయాంలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే ఎన్డీఏ సాధించింది చాలా ఎక్కువ. ఉదాహరణకు 2004-2014 మధ్యకాలంలో యూపీఏ ప్రభుత్వం పట్టణ పేదలకోసం 13.82 లక్షల గృహాలను మంజూరు చేస్తే.. మూడేళ్ల కాలావధిలోనే మోదీ ప్రభుత్వం 17.73 లక్షల ఇళ్లను మంజూరు చేసి చరిత్ర సృష్టించింది. నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా ఊపింది. అరవై నగరాల్లో స్మార్ట్ సిటీ ప్రణాళికల అమలుకు కేటాయించిన రూ. 1.38 లక్షల కోట్లు, 'అమృత్' కార్యక్రమం కింద రూ. 0.78 లక్షల కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) కింద రూ. 0.66 లక్షల కోట్లు, నూతన మెట్రో ప్రాజెక్టులకు ఉద్దేశించిన రూ. 0.45 లక్షల కోట్లు, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద అందుబాటు గృహాల కోసం కేటాయించిన రూ. 1.04 లక్షల కోట్లు ఇందులో భాగమే! వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్ది, మరో అయిదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేసే కృషిలో భాగంగా ప్రభుత్వం వ్యవసాయ రుణాలకు కేటాయించిన మొత్తాన్ని రూ. 10 లక్షల కోట్లకు పెంచింది. 2016-17లో వ్యవసాయంలో వృద్ధి రేటు 4.1శాతానికి చేరడం గమనార్హం. మౌలిక సౌకర్యాల రంగానికి మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రైల్వేల అభివృద్ధికి రూ. 8లక్షల కోట్లు, రహదారుల కోసం రూ. 3లక్షల కోట్ల భారీ మొత్తం అందించాలని నిర్ణయించింది. మరోవంక రాజకీయ సంస్కరణల్లో భాగంగా పారదర్శకతకు పట్టం కడుతూ.. పార్టీల నగదు విరాళాలను రెండు వేల రూపాయలకు పరిమితం చేసింది. గడచిన మూడేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన సమున్నత విజయాల్లో ఇవి కేవలం కొన్ని మాత్రమే! దేశ పౌరులందరికీ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పిస్తూ ఇదే స్థాయి దీక్షాదక్షతలతో ఇకమీదటా కదం తొక్కేందుకు మోదీ ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక సారథ్యమే స్ఫూర్తిగా పురోభివృద్ధి పథంలో సరికొత్త చరిత్రను లిఖించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం సదా ఉరకలెత్తుతూనే ఉంటుంది. ■

ముఖాముఖి

# బిజెపి విజయాలను ప్రత్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు!



**కాంగ్రెస్‌ను రద్దు చేయాలన్న మహాత్మా గాంధీ కోరికను రాహుల్ గాంధీ నెరవేరుస్తున్నారని బిజెపి మాజీ జాతీయాధ్యక్షుడు, కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి ఎద్దేవా చేశారు. ఓ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఈ ఇంటర్వ్యూలో ఎన్డీఏ ప్రభుత్వ మూడేళ్ళ పాలన, ప్రతిపక్షాల ఆరోపణలు, రాబోయే రాష్ట్రపతి ఎన్నికల గురించి చర్చించారు. జనసందేశ్ పాఠకుల కోసం ఆ ఇంటర్వ్యూ:**

**ప్ర: మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ళు పూర్తవుతుండగా మీ పార్టీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని, సమాజంలో చీలికలు సృష్టిస్తోందని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. దీనికి మీరేమంటారు?**

**జ:** 'అందరితో కలిసి, అందరి అభివృద్ధి' లక్ష్యాన్ని మా ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో అనుసరిస్తోందని మరోసారి స్పష్టం చేస్తున్నాను. మేము ఎటువంటి మతతత్వ రాజకీయాలకు పాల్పడం. కులం, మతం, భాష, ప్రాంతం, వర్గాల ప్రాతిపదికగా మేము ఎవరి పట్లా వివక్ష ప్రదర్శించం. కాషాయ వస్త్రాలు కట్టుకున్న వారితోను, గోరక్ష పేరుతో హింసకు పాల్పడే సంస్థలతోనూ బిజెపిని ముడిపెట్టడం అన్యాయం. మాకు వారికీ అటువంటి సంబంధం లేదు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వాళ్ళపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. కేంద్రం, వివిధ రాష్ట్రాలలోని బిజెపి ప్రభుత్వాలను అప్రతిష్ఠపాలు చేయడానికి ఒక పథకం ప్రకారం ప్రయత్నాలు జరుతుగున్నాయి. బిజెపి ప్రభుత్వాల అద్భుతమైన పనితీరును, దేశవ్యాప్తంగా అప్రతిహత పురోగమనాన్ని హిందూ వ్యతిరేక శక్తులు, కమ్యూనిస్టులు, జాతి విద్రోహ శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయి. ప్రజలలో లేనిపోని భయాలను సృష్టించడమే వారి వ్యూహం. వెనుకబడిన తరగతులు, మైనారిటీల్లో భయాందోళనలను సృష్టించ డానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఇది వారి ఓటుబ్యాంకు రాజకీయాలకు మరో ఉదాహరణ.

**ప్ర: కానీ ముఖ్యంగా కాంగ్రెస్ మీ వాదనతో ఏకీభవించడం లేదు, గోరక్షకుల పేరిట దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తోంది?**

**జ:** కాంగ్రెస్ ఇంకా ఓటమి షాక్ నుంచి తేరుకోలేదు. అందుకే ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు గుప్పిస్తోంది. ఆ పార్టీ నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయింది. అసలు మహాత్మా గాంధీ కాంగ్రెస్‌ను రద్దు చేయాలని అన్నారు. కానీ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆ పని చేయలేదు. కానీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మహాత్ముడి సూచనను సీరియస్‌గా తీసుకున్నట్టున్నారు, కాంగ్రెస్‌ను రద్దుచేయడానికి రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు.

**ప్ర: ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని కూడా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?**

**జ:** అది పూర్తిగా అసత్యం. తన పదేళ్ళ పాలనలో కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమే. వారు నా మీద కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు (గడ్కారి స్థాపించిన పూర్తీ గ్రూపునకు 2013లో ఆదాయం పన్ను నోటీసులు జారీ చేశారు). అయితే ఆ తరువాత నేను నిర్దోషినని తేలిందనుకోండి. దర్యాప్తు సంస్థలు ఇటీవల చేసిన దాడులకు కేంద్ర మాజీ ఆర్థిక మంత్రిపై చిదంబరం, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌లు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం మానుకోవాలి. చట్టం తన పని తానూ చేసుకుపోతుంది.

**ప్ర: ప్రతిపక్షాల విమర్శలను అలా పక్కన పెడితే, ఎన్డీఏ ప్రభుత్వ మూడేళ్ళ పాలన గురించి ఏమి చెప్పదలచుకున్నారు?**

**జ:** 2014 మేలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదాయం రూ.13 లక్షల కోట్ల నుంచి రూ.20 లక్షల కోట్లకు పెరిగింది. ఇది ముమ్ముందు రూ.28-30 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా. ఆర్థిక వ్యవస్థ రెట్టింపు అవుతుంది. పెద్ద నోట్ల రద్దును విజయవంతంగా అమలు చేసాం. మరోవైపు మేడ్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, సాండప్ ఇండియా వంటి కార్యక్రమాలను చురుగ్గా అమలుచేస్తున్నాం. అలాగే నవకల్పన,

పారిశ్రామిక తత్త్వం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలను ప్రోత్సహించడానికి పలు చర్యలను ప్రభుత్వం తీసుకుంటోంది.

అంతేకాక మౌలిక సదుపాయాలూ, వ్యవసాయం, గ్రామీణాబివృద్ధి తదితర రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. కోకింగ్ కోల్ (ఉక్కు తయారీలో వాడే ప్రత్యేక తరహా బొగ్గు) మినహా బొగ్గు, విద్యుత్ రంగాల్లో భారత్ ఇప్పుడు మిగులు సాధించింది.

వ్యవసాయరంగ వృద్ధి రేటును మరింత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ స్థాయిలో వ్యవసాయ వృద్ధి రేటును వచ్చే రెండేళ్లలో 14 శాతానికి పెంచాలన్నది మా లక్ష్యం. మొట్టమొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం నీటిపారుదలకు రూ.75 వేల కోట్లు కేటాయించింది. ఇందులో దాదాపు రూ.36 వేల కోట్లు మహారాష్ట్రకు వస్తాయి. దేశవ్యాప్తంగా కొత్తగా 50 లక్షల హెక్టార్ల భూమిని సాగులోకి తీసుకురావడానికి దీనివల్ల సాధ్యమవుతుంది.

అన్నిటికంటే ముఖ్యమైన విషయం జూలై 1 నుంచి దేశావ్యాప్తంగా వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి రావడం. ఈ పన్ను పరిస్థితిని సమూలంగా మార్చివేస్తుంది. దీనివల్ల ఇక చీకటి, సమాంతర ఆర్థిక వ్యవస్థకు చోటు ఉండదు. ప్రభుత్వ ఆదాయం అనేక రెట్లు పెరుగుతుంది, దాంతో పాటే వృద్ధి రేటు కూడా.

సామాజిక, ఆర్థిక పరివర్తనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పదేళ్ళలో చేయలేని పనిని ఎన్డీఏ ప్రభుత్వం కేవలం మూడేళ్ళలో చేసి చూపించింది. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు భారత్ ఒక ప్రపంచ శక్తిగా ఆవిర్భవించడానికి దోహదం చేయనున్నాయి.

**ప్ర: మీ మంత్రిత్వ శాఖ తీసుకున్న చర్యల గురించి వివరిస్తారా?**

**జ:** రికార్డు స్థాయిలో రూ.16 వేల కోట్ల రోడ్డు కాంట్రాక్టులను ఇప్పటికి ఇచ్చాం. ఇది లిమ్కా బుక్ అఫ్ రికార్డ్స్‌లోకి కూడా ఎక్కింది. రోడ్డు నిర్మాణం రోజుకు రెండు కిలోమీటర్ల నుంచి భారీగా 23 కి.మీలకు పెరిగింది. దీన్ని రోజుకు 40 కి.మీలకు పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటివరకు రోడ్లు, జాతీయ రహదారులు, రేవులు, షిప్పింగ్‌పై రూ.6 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. ఇవికాక రేవులను రైలు మార్గాలతో అనుసంధానించే రెండు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టును మా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.

పైగా నౌకాయానరంగంలో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఇందులో ఆరు లక్షల కోట్లు రేవుల ఆధునీకరణ, యాంత్రికీకరణ, రోడ్డు, రైలు అనుసంధానానికి ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే లక్షన్నర కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. మిగతావి ప్రారంభం కాబోతున్నాయి. ఓడరేవులు రికార్డు స్థాయిలో రూ.5 వేల కోట్ల లాభాలు ఆర్జించాయి

**"అన్నిటికంటే ముఖ్యమైన విషయం జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి రావడం. ఈ పన్ను పరిస్థితిని సమూలంగా మార్చివేస్తుంది. దీనివల్ల ఇక చీకటి, సమాంతర ఆర్థిక వ్యవస్థకు చోటు ఉండదు. ప్రభుత్వ ఆదాయం అనేక రెట్లు పెరుగుతుంది, దాంతో పాటే వృద్ధి రేటు కూడా."**

అంటే రూ.34 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు- రేవుల రంగలో రూ.16 లక్షల కోట్లు, రోడ్డు రంగంలో రూ.15 లక్షల కోట్లు, వాహన రంగంలో రూ.3 లక్షల కోట్లు ప్రతిపాదనలో ఉన్నాయి. ఈ పెట్టుబడులు రానున్న ఐదేళ్ళలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరగడానికి దోహదం చేస్తాయి.

**ప్ర: కొత్త రాష్ట్రపతి ఎన్నికపై ఏకాభిప్రాయ సాధనకు ప్రధాన మంత్రి చొరవ తీసుకోవాలని కొన్ని పార్టీలు చేస్తున్న సూచనపై మీ అభిప్రాయం?**

**జ:** రానున్న రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించినంత వరకు బిజెపిలో అంతర్గతంగా ఎటువంటి చర్చా మొదలు కాలేదు. అయితే బిజెపి మాత్రం ఏకాభిప్రాయ సాధనకు కట్టుబడే ఉంది.

**ప్ర: ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌ను రాష్ట్రపతి చేయాలని బిజెపి మిత్రపక్షం శివసేన పట్టుబడుతోంది. దీన్ని మీరు బలపరుస్తారా?**

**జ:** రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా బరిలో నిలిచే ఆలోచన లేదని ఆరెస్సెస్ అధినేత ఇప్పటికే స్పష్టం చేశారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్‌లో అమరవీరుల స్థూపానికి బిజెపి నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పడాకుల సత్యం, పాండురంగా రెడ్డి, తిరుపతి రెడ్డి, అంజన్ కుమార్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్తమానం

# వాడవాడలా బిజెపి నేతలు



పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కార్యవిస్తారక్ యోజనలో బిజెపి నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి మారుమూల పల్లె వరకు ఇంటింటికీ వెళ్లి మోదీ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. దీన్‌దయాళ్ జీ జీవిత చరిత్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు, టీఆర్ఎస్ వైఫల్యాలతో కూడిన కరపత్రాలను పంచుతున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



నల్గొండలో ఇంటింటి ప్రచారంలో డా॥ కె.లక్ష్మణ్



హైదరాబాద్ రాంనగర్ డివిజన్‌లో
కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ఇంటింటి ప్రచారం



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో జి.కిషన్ రెడ్డి ఇంటింటి ప్రచారం



పెద్దపల్లి జిల్లా బోజనపేట్‌లో చింతల రామచంద్రా రెడ్డి ఇంటింటి ప్రచారం



హైదరాబాద్ మూసాపేట ఇంటింటి ప్రచారంలో మాధవరం కాంతారావు



హన్మకొండలో టి.ఆచారి, రావు పద్మ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో ఎన్.రాంచందర్ రావు, దేవర కరుణాకర్



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఇంటింటి ప్రచారం



మల్కాజ్ గిరిలో ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు ఇంటింటి ప్రచారం



మహబూబ్‌నగర్ జిల్లా డివిటిపల్లి గ్రామంలో పద్మజా రెడ్డి ఇంటింటి ప్రచారం



కరీంనగర్‌లో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు
పేరాల శేఖర్ రావు ఇంటింటి ప్రచారం



భద్రాద్రి కొత్తగూడెంలో రఘునందన్ రావు ఇంటింటి ప్రచారం



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఎన్.ఇంద్రసేనారెడ్డి ఇంటింటి ప్రచారం



ఖైరతాబాద్‌లో ఇంటింటి ప్రచారం



సనత్‌నగర్‌లో గుండగోని భరత్ గౌడ్ ఇంటింటి ప్రచారం



మోదీ పథకాలపై ముస్లిం మహిళల ఆసక్తి



వ్యర్థమైన మాటలు వేల కన్నా, సార్థకమైన మాట ఒక్కటి చాలు. - గౌతమ బుద్ధుడు

అసూయ అగ్నికణం వంటిది. అది అంటుకున్న వారిని దహించేస్తుంది. - గౌతమ బుద్ధుడు

సైద్ధాంతిక విషయాలు

# ఇకపైన అంతా విజయమే!



కాలగర్భంలో కలిసి పోని నాయకులెవరు వారి గొప్పతనం లక్షణ మేమిటి? రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మాత పూ. డాక్టర్జీ జీవితంలోని ఒక ఘట్టాన్ని ఈ సందర్భంలో గుర్తు చేసుకోవడం సముచితంగా ఉంటుంది. వారు కీర్తి పరాన్ముఖులు.ఒకసారి దామోదర పంత్ అనే పెద్దమనిషి డాక్టర్జీ వద్దకు వచ్చి ఇలా అన్నారు. "నేనొక థీసీస్ తయారు చేస్తున్నాను. అందులో మహా పురుషుల చరిత్రలు వ్రాయాలి. మీ బయోడేటా ఇవ్వండి." దానికి డాక్టర్జీ ఇలా జవాబిచ్చారు. "నా జీవిత చరిత్రను మీరేం చేసుకుంటారు? నేను చాలా చిన్న వాణ్ణి. వ్రాయాలని ఉంటే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గురించి వ్రాయండి. నాకంటూ వేరే జీవన చరిత్ర లేదు.'' ఇలా కీర్తిపై వ్యామోహాన్ని దరిజేరనివ్వని వారు నేడెందరున్నారు?

పూ.డాక్టర్జీ గొప్పదనం గురించి 1966-68 మధ్యకాలంలో జరిగిన ఒక చర్చ ఇప్పుడు నాకు గుర్తుకు వస్తోంది. నేను కేరళలోను, బెంగాల్‌లోను ప్రచారక్‌గా పనిచేసి ఉన్నాను. నేను రాజ్యసభ సభ్యుడినైనప్పుడు కమ్యూనిస్టు ఎం.పిలు చాలా మంది కేరళ, బెంగాల్‌లకు చెందిన వారే. వారితో టీ త్రాగుతూ అప్పుడప్పుడూ పార్లమెంట్ సెంట్రల్ హాలులో మాటా మంతీ జరుపుతూండేవాడిని. వారిలో ఒకాయన నన్ను ఉడికించాలని ఠేంగ్డేజీ! మీ ఆరెస్సెస్ పూర్తి పేరేమిటి?" అని అడిగాడు. నేను చెప్పాను. ఆయన మళ్ళీ "ఎప్పుడు స్థాపించబడింది? ఎవరు స్థాపించారు?" అని అడిగాడు. వాటికీ జవాబులు చెప్పాను. పూ.డాక్టర్జీ పేరు వినగానే ఆయన ముఖం వంకరగా పెట్టి హీనతాపూర్వకంగా డా.హెడ్గేవారా? ఈ పేరు ఇంతకు ముందెప్పుడూ వినలేదే!" అన్నాడు. నన్ను ఉడికించడానికి అలా అంటున్నాడని గ్రహించి నేను ఊరుకున్నాను. వారిలో పాలఘాట్‌కు చెందిన బాలచంద్రమీనన్ ఉన్నారు. ఆయన కొంచెం సీరియస్ స్వభావం కల వ్యక్తి. ఆయన తన కమ్యూనిస్టు మిత్రులతో "మహాపురుషుల గురించి చులకనగా మాట్లాడవద్దు" అన్నారు. ప్రశ్న అడిగిన వ్యక్తి "నేను చులకన చేసి మాట్లాడటం లేదు." అన్నాడు. "మీరు సీరియస్‌గానే మాట్లాడు తున్నట్లయితే నేను అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి" అని, "పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎప్పుడు మరణించారు?" అన్నారు శ్రీమీనన్. 1964లో అని సమాధానం వచ్చింది. మరణించే సమయానికి జవహర్‌లాల్ కీర్తి ఎంతదూరం వ్యాపించింది? అన్నారు మీనన్. "మీరు ఏం ప్రశ్న అడుగుతున్నారు? నెహ్రూ మరణించే నాటికి తృతీయ ప్రపంచపు ప్రముఖ నాయకులైన నాజర్, టిటో, నెహ్రూ అనే ముగ్గురు నాయకుల్లో పండిట్ నెహ్రూ ఒకరని అందరికీ తెలుసు." అన్నాడు కమ్యూనిస్టు మిత్రుడు.

ఆ తరువాత మీనన్‌జీ నావైపు తిరిగి "ఠేంగడేజీ! మీ డా.హెడ్గేవార్ ఎప్పుడు మరణించారు?" అని అడిగారు. 1940లో అని చెప్పాను. మరణించే నాటికి డా.హెడ్గేవార్‌ను ఎందరు ఎరుగుదురు? ఆయనకు ఎంతకీర్తి ఉండేది?" అని మీనన్‌జీ నన్ను మళ్ళీ అడిగారు. "ఏమీలేదు. మా సెంట్రల్ ప్రావిన్సు అంటే ఇప్పటి మధ్యప్రదేశ్ విదర్భ ప్రాంతాలు ప్రజలు మాత్రమే ఆయన్ను ఎరుగుదురు. మా సంఘ కార్యం అప్పుడు ప్రారంభదశలో ఉండేది" అన్నాను నేను.

అప్పుడు మీనన్‌జీ ఇలా అన్నారు. "పండిట్ నెహ్రూ మరణం ఇటీవలే జరిగిన విషయం. అంతకు ఇరవై నాలుగు సంవత్సరాలకు పూర్వం డా.హెడ్గేవార్ మరణించారు. చనిపోయే సమయానికి ఆయన్ను ఆయన ప్రాంతానికి బయట ఎవరూ ఎరగరు. పండిట్ నెహ్రూ మరణించే నాటికి యావత్ప్రపంచమూ ఆయన్ను ఎరుగును. ఆయన ఒక ప్రపంచస్థాయి నాయకుడు. ఇప్పుడు నేనొక ప్రశ్న అడుగుతాను. ఇప్పుడు గనక పిలుపునిస్తే పండిట్ నెహ్రూ సిద్ధాంతాల కోసం ప్రాణాలు ఇవ్వడానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారు?డా.హెడ్గేవార్ సిద్ధాంతాల కోసం ప్రాణాలు ఇవ్వడానికి ఎందరు సిద్ధంగా ఉన్నారు?"

అలా అడిగి, మళ్ళీ తన కమ్యూనిస్టు మిత్రుని వైపు చూసి మీనన్ ఇలా అన్నారు. "పండిట్ నెహ్రూ సిద్ధాంతాలకోసం ఆత్మార్పణ చెయ్యడానికి ఇవాళ దేశం మొత్తం నుండి యాభై మంది కూడా ముందుకు రారు. డా.హెడ్గేవార్ సిద్ధాంతాల కొరకు ప్రాణాలివ్వడానికి లక్షలాది యువకులు ముందుకు వస్తారని మీకు తెలుసు, నాకు తెలుసు."

పరిస్థితి తారుమారైంది. నన్ను ఉడికించాలని చర్చను ప్రారంభించిన వ్యక్తికి ఇప్పుడు ఉడుక్కోవలసిన పరిస్థితి వచ్చింది. అరనిమిషంపాటు స్తబ్దుగా ఉండిపోయి. అతను మీనన్‌జీని ఇలా అడిగాడు, "ఇంతకూ గొప్పతనానికి తార్కాణం ఏమిటి?" శ్రీ మీనన్‌జీ తడుముకోకుండా జవాబు చెప్పారు. "భవిష్యత్కాలంపై ఒకరి ఛాయ ఎంత నిడివిగా, ఎంత దూరం పడుతుంది అనేదే తార్కాణం అన్నమాట"

మనపూర్వుల మాట ప్రకారం లౌకికులైన సాధువుల వాక్కు అర్థాన్ని అనుసరిస్తుంది. కాని ఆద్య ఋషుల విషయంలో అర్థమే వాక్కును అనుసరిస్తుంది. వర్తమాన కాలపు మహాఋషి పూ.గురూజీ జీవిత యాత్ర అంతిమ చరణమైన 1973 ఏప్రిల్‌లో వారి నుండి వెలువడిన వాక్కులు "ఇకపైన అంతా విజయమే"


**ఆధారం కార్యకర్త, దత్తోపంత్‌ఠేంగ్డే**

స్ఫూర్తి

# జన సంఘ్ ఎందుకు?

**1951 అక్టోబర్ 21న ఢిల్లీలో జరిగిన భారతీయ జన సంఘ్ మొదటి సదస్సులో అధ్యక్షోపన్యాసం చేసిన డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన సంఘ్ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. పాఠకుల కోసం ఆయన ప్రసంగ పాఠాన్ని అందిస్తున్నాం.**

దేశ చరిత్రలో కీలకమైన తరుణంలో జరుగుతున్న ఈ సదస్సుకు మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను. మన ముందున్న లక్ష్యం ఎంత కఠినమో నాకు తెలుసు. మనం అనేక అడ్డంకులను ఎదుర్కోవాల్సి ఉంది. గట్టి ప్రత్యర్థులతో తలపడాలి. ఏ మహత్తర లక్ష్యాల సాధనకైతే మన పార్టీ ఏర్పడిందో ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనం ఐక్యంగా కృషి చేస్తామన్న నమ్మకం నాకు ఉంది. ఈ లక్ష్యాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అవి మీ అందరికీ తెలుసు. మొక్కవోని ధైర్యంతో, శక్తి సామర్థ్యాలతో కలిసికట్టుగా కృషి చేస్తే, ఎన్నుకున్న మార్గం నుంచి వైదొలగకపోతే, ప్రజలకు సేవ చేస్తూ ఉంటే, మాతృ భూమి గౌరవమర్యాదలను కాపాడడానికి ప్రయత్నిస్తే అంతిమగా మనకు విజయం దక్కుతుంది. వచ్చే ఎన్నికలలో పోటీ చేయడానికి మాత్రమే భారతీయ జన సంఘ్ ఏర్పాటు కాలేదని స్పష్టంగా చెప్ప దలచుకున్నాను. ఎన్నికలకు ప్రాధాన్యత ఉన్న మాట నిజమే. అవకాశం ఉన్న చోటల్లా మన పార్టీ అభ్యర్థులను నిలబెడతాం. ఎన్నికలు మన సిద్ధాంతాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లడానికి ఉపయోగపడతాయి. దేశవ్యాప్తంగా పార్టీ పటిష్టతకు పునాది వేయడానికి ఉపకరిస్తాయి. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ ఆ తర్వాత కూడా మన పార్టీ పని చేస్తూనే ఉంటుంది. అన్ని వర్గాల ప్రజలలో నమ్మకం పాదుకొల్పడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. స్వతంత్ర భారత నిర్మాణానికి ప్రజల నుంచి స్ఫూర్తి పొందుతూనే ఉంటుంది. స్వాతంత్ర్యం సంపాదించి నాలుగేళ్లు అయింది. కాని ప్రస్తుతం అన్ని రకాలుగానూ దిగజారింది. ప్రజల కష్టాలు, కడగండ్లు స్వాతంత్ర్యం రాక ముందుకన్నా పెరిగాయి. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తే అంతర్జాతీయ పరిణామాలు మన ఆర్థిక వ్యవస్థ మందకొడిగా ఉండడానికి పాక్షికంగా కారణం కావొచ్చు. కాని ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం ప్రభుత్వ వైఫల్యమే. దేశ ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేక పోయింది. ఒకవేళ పరిష్కరించగలిగితే జన సంక్షేమం మెరుగుపడేది. ప్రస్తుతం దేశంలో నిరాశ, నిస్పృహలు తాండవిస్తున్నాయి. ప్రభుత్వం సజావుగా, నిష్పక్షపాతంగా పని చేస్తుందన్న ప్రజల నమ్మకం వమ్మైంది. దేశవ్యాప్తంగా ఉన్న ఈ అసంతృప్తిని అంగీకరించి ప్రజల సహకారంతో సమస్యలను పరిష్కరించడానికి బదులు ప్రభుత్వం విమర్శలను సహించడం లేదు. న్యాయబద్ధమైన ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయడాన్ని నిరోధిస్తోంది.



ఎన్నికలు మన సిద్ధాంతాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లడానికి ఉపయోగపడతాయి. దేశవ్యాప్తంగా పార్టీ పటిష్టతకు పునాది వేయడానికి ఉపకరిస్తాయి. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ ఆ తర్వాత కూడా మన పార్టీ పని చేస్తూనే ఉంటుంది. అన్ని వర్గాల ప్రజలలో నమ్మకం పాదుకొల్పడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. స్వతంత్ర భారత నిర్మాణానికి ప్రజల నుంచి స్ఫూర్తి పొందుతూనే ఉంటుంది.

### ప్రతిపక్ష పార్టీల ఆవశ్యకత

నాలుగేళ్ల కింద అపారమైన ప్రజాభిమానంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల మద్దతు కోల్పోవడమే కాక అనుమానాస్పద పద్ధతుల్లో అధికారం నిలబెట్టుకుంటోంది. కాంగ్రెస్ పరిపాలనలో నియంతృత్వ పోకడలు కనిపించడానికి ప్రధానమైన కారణం వ్యవస్థీకృతమైన ప్రతిపక్ష పార్టీ లేకపోవడమే. బలమైన ప్రతిపక్ష పార్టీ ఉంటే అధికార పక్షం తప్పులు ఎత్తి చూపగలుగుతుంది. ప్రత్యామ్నాయం ఉంటుంది. అఖిల భారత పార్టీగా అవతరిస్తున్న భారతీయ జన సంఘ్ ప్రధానమైన ప్రతిపక్ష పార్టీగా పని చేస్తుంది. అంత మాత్రం చేత ఓటర్ల మద్దతు సమకూరితే పరిపాలనా బాధ్యతలు చేపట్టడానికి జనసంఘ్ వెనుకాడుతుందని కాదు. అది సాధ్యం కానప్పుడు ప్రతిపక్షంగా ఉంటుంది. చట్ట సభ లోపల, వెలుపల ఇలాగే ఉంటుంది. ప్రతిపక్షం అంటే అర్థం లేకుండా అయినదాన్ని కాని దాన్ని వినాశకరమైన రీతిలో వ్యతిరేకించడం కాదు. అందువల్ల మనం ప్రభుత్వం తీసుకునే చర్యలను, ఆమోదించే చట్టాలను వ్యతిరేకించవచ్చు. కాని ఇది నిర్మాణాత్మక స్ఫూర్తితో ఉంటుంది. ప్రజలు జాగరూకంగా ఉండడానికి తోడ్పడుతుంది. అసలైన ప్రజాస్వామ్య, పరిపాలనా వ్యవస్థలు నిర్మించడానికి మనకు చేతనైనంత కృషి చేస్తాం.

ఈ సదస్సులో పాల్గొంటున్న వారి ప్రతినిధులతో చర్చించి మన భవిష్యత్ కార్యాచరణకు తుది రూపు ఇస్తాం. మన పార్టీ కొద్ది నెలలుగా కొన్ని రాష్ట్రాలలో పని చేస్తోంది కనక మన పార్టీ కార్యక్రమాలు ఏమిటో ప్రజలకు స్థూలంగా తెలుసు.


### భారతీయ జాతీయత

కులం, మతం, జాతి తేడా లేకుండా మన

సంస్మరణ

# అనిల్ దవే: అసమాన నేత

మే 18న మృతి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి శాఖలను స్వతంత్రంగా నిర్వహించిన అనిల్ మాధవ్ దవే పర్యావరణ పరిరక్షకుడు కూడా. ఆయన 2009 నుంచి మధ్యప్రదేశ్‌కు రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జల వనరుల మంత్రిత్వ శాఖ సంఘం, సమాచార, ప్రసార శాఖకు అనుబంధంగా ఉన్న సలహా సంప్రదింపుల కమిటీ సభ్యునిగా ఆయన పని చేశారు. 2016 జులై 5న మోదీ మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు దవేను పర్యావరణ శాఖ సహాయమంత్రిగా నియమించారు.



మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లా బద్ నగర్‌లో 1956 జులై 6న దవే జన్మించారు. ఇండోర్‌లోని గుజరాతి కళాశాల నుంచి వాణిజ్య శాస్త్రంలో స్నాతకోత్తర పట్టా పుచ్చుకున్నారు. అప్పుడే ఆయన రాజకీయాలలో కూడా భాగస్వామి అయ్యారు. లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ నడిపిన ఉద్యమంలో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

దవే మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సంతాపం తెలిపారు. హోషంగాబాద్ జిల్లాలోని బాంద్రాభాన్‌లో నర్మదా నది ఒడ్డున దవే భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింఘ్ చౌహాన్, కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, ఉమా భారతి, అనంత్ కుమార్, నరేంద్ర సింఘ్ తోమర్, తావర్ చంద్ గెహ్లోట్, సీనియర్ ఆరెస్సెస్ నాయకులు భయ్యాజీ జోషి, దత్తాత్రేయ హోస్బోలె, సురేశ్ సోని, బిజెపి ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ వర్గీయ మొదలైన వారు ఈ అంత్యక్రియలలో పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**

పార్టీలో అందరికీ సభ్యత్వానికి అవకాశం ఉంటుంది. ఆచారాలు, అలవాట్లు, మతం, భాష మొదలైన అంశాలలో భారత్‌లో అనేక వైవిధ్యాలు ఉన్నాయి. సోదరభావం ఆధారంగా ప్రజలను ఐక్యం చేయాలి. మాతృభూమి అందరికీ ఒక్కటే అన్న భావనతో పని చేయాలి. భిన్నత్వంలో ఏకత్వం పరిరక్షించడానికి మన పార్టీ పాటుపడుతుంది. ప్రస్తుతం కులం, మతం, ప్రాంతం, సిద్ధాంతం పేర అనేక నినాదాలు వినిపిస్తున్నాయి. కాని భారత నాగరికత, సంస్కృతిలో భిన్నత్వమే విశిష్టమైంది. భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి మన పార్టీ పాటుపడుతుంది. భారత జాతీయత పునాదిని పటిష్టపరచడం సులభం కాదు. కుల మతాల ఆధారంగా రాజకీయ మైనారిటీలను ప్రోత్సహించడం ప్రమాదకరం కాని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో అందరినీ సమాన దృష్టితో చూడవలసిన బాధ్యత మెజారిటీ వర్గం మీద ఉంది. ఈ విషయంలో మన పార్టీ సంపూర్ణ హామీ ఇస్తుంది. చాలా మంది భారతీయులు వెనుకబడి ఉన్నారని, అణగారిపోయి ఉన్నారని మనం గుర్తిస్తాం. వారి సామాజిక, ఆర్థిక స్థాయి మెరుగుపడడానికి వారికి సకల అవకాశాలూ ఇవ్వాలి. అప్పుడే వారు తమ సోదరులతో కలిసి దేశ నిర్మాణానికి పాటుపడగలుగుతారు. దేశ సెక్యులర్ లక్షణాన్ని పరిరక్షించే హడావుడిలో కాంగ్రెస్ ముస్లింలను, ఆ వర్గానికి చెందిన కొంతమంది నాయకులను ప్రోత్సహించడానికి ప్రయత్నించింది. కులం, మతం, జాతితో సంబంధం లేకుండా అందరూ సమానమేనని కాంగ్రెస్, ముఖ్యంగా ప్రధానమంత్రి నిరంతరం చెప్తూ ఉంటారు. కాని ఆచారాలు, అలవాట్లు, మతం, భాష మొదలైన అంశాలలో భారత్ వైవిధ్యభరితమైందన్నది మన పార్టీ అభిప్రాయం. ఉమ్మడి మాతృభూమి అన్న భావన ఆధారంగా ఐక్యత సాధించాలి. ఎవరైనా మంచి హిందువుగా, మంచి సిక్కుగా, మంచి బౌద్ధుడిగా, క్రైస్తవుడిగా, ముస్లింగా ఉండొచ్చు. అదే సమయంలో గట్టి భారతీయుడుగా కూడా ఉండొచ్చు. భారతీయ సంస్కృతి, మర్యాదను గుర్తించి సక్రమంగా అమలు చేస్తేనే భారత్ భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందన్నది మన నిశ్చితాభిప్రాయం. భిన్నమైన – దేశ విదేశీ సిద్ధాంతాల మధ్య ఘర్షణ, సామరస్యం, సమన్వయం కారణంగానే భారతీయ సంస్కృతి, నాగరికత రూపుదిద్దుకున్నాయి. ఈ నాటకీయమైన పరిణామాలు వేలాది సంవత్సరాల పాటు కొనసాగాయి. సామ్రాజ్యాలు రాజ్యమేలాయి. పతనమయ్యాయి. ఇందులో అనేకమంది విశిష్ట వ్యక్తుల ఉత్థానపతనాలూ ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి మనకు అందిన ఈ వారసత్వాన్ని చూసి హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు గర్వపడనివ్వండి. అయితే ఈ ప్రాచీన నాగరికత నిలవనీటిలా ఉండిపోకూడదు. నీరుకారి పోకూడదు. స్వతంత్ర భారత భవిష్యత్తు భారతీయ ఆదర్శాలతో ముడిపడి ఉండాలి. అవసరమైతే ఈ ఆదర్శాలు ఆధునిక, శాస్త్రీయ యుగానికి అనుగుణంగా మారొచ్చు. ఇది మన జాతీయ విద్యావిధానంలో ప్రతిఫలించాలి. మనం ధర్మ రాజ్యానికి లేదా న్యాయమార్గ పాలనకు కట్టుబడి ఉన్నామంటే మనం భారతీయ సంస్కృతికి కట్టుబడి ఉన్నామనే. ఇదే ప్రజలను సమైక్యంగా ఉంచుతుంది. ■



ఎక్కువగా పనిచేయడం, తక్కువగా తినడం, మితంగా మాట్లాడ్డం మంచివారి లక్షణాలు. – జగన్నాథ పండితుడు




# అసాధ్యాలను సుసాధ్యం చేసిన మోదీ: అమిత్ షా

నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మే 26వ తేదీన ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను, పేదల సంక్షేమం కోసం రూపొందించిన విధానాలను వివరించారు.

### సాథ్ హై, విశ్వాస్ హై, హో రహా హై వికాస్

వివిధ రంగాలలో అసాధ్యమైన వాటిని సాధించి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం సరికొత్త మైలురాయి సృష్టించిందని అమిత్ షా అన్నారు. బిజెపి ప్రభుత్వం మహత్తరమైన నూతన భారత్ కోసం గట్టి పునాది వేసిందని చెప్పారు. గత మూడేళ్ల కాలంలో దేశ ఆత్మవిశ్వాసాన్ని మోదీ పెంపొందింప చేశారని, ప్రపంచంలో దేశ ప్రతిష్ఠ ఇనుమడింప చేశారని, అన్నింటికన్నా ముఖ్యంగా మొత్తం దేశం ఆలోచనా విధానాన్నే మార్చారని షా తెలియజేశారు. గత మూడేళ్లలో దేశ రాజకీయాలలో మౌలికమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రతిపక్షాలు కూడా ఈ ప్రభుత్వం మీద అవినీతి ఆరోపణలు చేయలేకపోయాయి. వంశపారంపర్య రాజకీయాలకు, కొన్ని వర్గాలను సంతృప్తి పరిచే విధానాలకు తెరపడింది. ఇది శుభసూచకం. గత 70 ఏళ్ల కాలంలో సాధించనిది ఈ మూడేళ్లలో సాధించినందువల్లే "సాథ్ హై, విశ్వాస్ హై, హో రహా వికాస్ హై" అన్న నినాదాన్ని రూపొందించినట్టు షా చెప్పారు.

### జవాబుదారీ, పారదర్శక, నిర్ణయాత్మకమైన ప్రభుత్వం

మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించింది. ఈ నిర్ణయం 1955 నుంచి పెండింగ్‌లో ఉంది. ఈ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించినందు వల్ల కోట్లాది మంది తలెత్తి జీవించగలుగుతున్నారు. నలభై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఒకే ర్యాంకు, ఒకే పింఛన్ పథకాన్ని ఆమోదించి ఉద్యోగ విరమణ చేసిన సైనికుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా 8000 కోట్ల రూపాయలు జమ చేశాం. ఒకే దఫా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించి చరిత్ర సృష్టించాం. అంతరిక్ష రంగంలో ప్రపంచంలోనే మేటిగా నిలిచాం.

పాకిస్థాన్‌లోని తీవ్రవాద స్థావరాలపై గురి చూసి దాడి చేయడంలో సైన్యం అపారమైన ధైర్య సాహసాలు ప్రదర్శిస్తే ప్రధాని సంకల్ప బలం చాటకున్నారు. దీని వల్ల భారత శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి తెలిసొచ్చాయి. పెద్ద నోట్ల రద్దు, నకిలీ కంపెనీల మీద చర్య, బినామీ లావాదేవీలకు వ్యతిరేకంగా చట్టం చేయడంతో నల్లధనానికి వ్యతిరేకంగా ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహరించింది. దేశంలో ఎన్నికల సంస్కరణల విషయంలో మోదీ ప్రభుత్వం కొత్త ఆలోచనలు ప్రతిపాదించింది. దీని వల్ల లోక్‌సభ నుంచి పంచాయతీ వరకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించవచ్చు. ఇది ప్రజల మీద భారం తగ్గిస్తుంది.

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) బిల్లును ఆమోదించడంలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి ఒకే దేశం, ఒకే పన్ను విధానం సాకారం చేయగలిగాం. ఇది మహత్తరమైన విజయం. అపూర్వమైన రీతిలో మోదీ ప్రభుత్వం 1100 కాలదోషం పట్టిన చట్టాలను రద్దు చేసింది.

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 48,000 కోట్ల రూపాయలు పంపిణీ చేశాం. ప్రజల జీవనాన్ని సుఖవంతం చేశాం. బాబా సాహెబ్ భీం రావ్ అంబేద్కర్ పేర భీం యాప్ ప్రవేశ పెట్టి డిజిటల్ లావాదేవీలను అమలు చేశాం.

అంగవికలులను 'దివ్యాంగులు' అనడం ద్వారా, వారి సంక్షేమానికి పథకాలు ప్రవేశ పెట్టడం వల్ల పేదలు, అణగారిన వర్గాలను మోదీ ప్రభుత్వం పట్టించుకుందని రుజువు చేశాం. ప్రసూతి సెలవును 26 వారాలకు పొడిగించడం ద్వారా మహిళలు తమ ఆరోగ్యాన్ని, తమ శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి వెసులుబాటు కల్పించింది.

ఈశాన్య భారత అభివృద్ధికి కూడా మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. మోదీ కారణంగానే యోగా ద్వారా భారత సంస్కృతికి అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చింది. భారత వైమానిక దళంలో తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌ను ప్రవేశ పెట్టి 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాం. భారత సైనిక దళ ఆధునీకరణ కొనసాగుతోంది. ప్రముఖుల వాహనాల మీద ఎర్ర బుగ్గకు స్వస్తి పలకడం ద్వారా అత్యంత ప్రముఖుల విధానానికి మంగళం పాడాం. "బేటీ బచావో, బేటీ పఢావో", "నమామి గంగే", "స్వచ్ఛతా అభియాన్" కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి మోదీ ప్రభుత్వం చొరవ తీసుకుంది.

### విజయాల సంవత్సరం

గత ఆర్థిక సంవత్సరం అనేక అంశాల దృష్ట్యా అద్భుతమైంది అని షా అన్నారు. 2016-17లో యూరియా ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. ఈ ఏడాది ఇథెనాల్ ఉత్పత్తి కూడా రికార్డు స్థాయిలో ఉంది. రికార్డు స్థాయిలో లక్షలాది మందికి వంట గ్యాస్ సరఫరా చేశాం. విద్యుదుత్పత్తి అపారంగా పెరిగింది. భారత రైల్వేల అభివృద్ధికి అధిక మొత్తంలో పెట్టుబడి సమకూర్చాం. భారీ స్థాయిలో జాతీయ రహదారులు నిర్మించాం. ద్విచక్ర వాహనాల, మోటారు వాహనాల ఉత్పత్తి కూడా రికార్డు స్థాయిలో పెరిగింది.

### సామాజిక రంగంలో సంస్కరణలు

జన్‌ధన్ యోజన కింద దేశవ్యాప్తంగా 28,000 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిపించాం. వీటిని భారత ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేశాం. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, జీవన్ సురక్షా బీమా వల్ల దాదాపు 13 కోట్ల మందికి సామాజిక భద్రత సమకూరింది. ఉజ్వల పథకం వల్ల రెండు కోట్ల మందికి వంట గ్యాస్ సదుపాయం కలిగింది. కోటి మంది సబ్సిడీ గ్యాస్ సదుపాయాన్ని వదులుకున్నారు. జెనెరిక్ ఔషధాల వల్ల పేదలకు ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

గుండె జబ్బులతో బాధపడే వారికి అవసరమైన స్టెంట్ల ధరలు 80 తగ్గించాం. 70 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా విద్యుత్ సరఫరా లేని 18,000 గ్రామాలు ఉంటే ఈ

ప్రభుత్వం 13,000 గ్రామాలకు విద్యుదీకరించింది. మిగతా గ్రామాలకు 2018 నాటికి విద్యుత్ సదుపాయం అందుతుంది. స్వయం ఉపాధి కోసం ఏడున్నర కోట్ల మందికి బ్యాంకు రుణాలు అందాయి. 2018 నాటికి కుష్టు వ్యాధి, బ్లాక్ ఫీవర్‌ను అంతమొందించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. 2020 నాటికి మశూచిని అంతం చేయాలని దీక్ష వహించింది.

మోదీ హయాంలో దేశవ్యాప్తంగా నాలుగున్నర కోట్ల మరుగుదొడ్లు ఏర్పాటయ్యాయి. ఇంద్రధనుస్సు కార్యక్రమం కింద ఏడున్నర కోట్ల మంది బాలలకు టీకాలు వేయించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం కింద యువతకు శిక్షణ ఇస్తున్నారు. స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్కిల్ ఇండియా, కరెన్సీ పథకాల కింద ఎనిమిది కోట్ల మందికి ఉపాధి లభించింది. కనీస వేతనం 42శాతం పెరిగింది. భవిష్య నిధి ఖాతాలను ఒక్క తాటిమీదకు తెచ్చినందువల్ల కార్మికుల సమస్యలు తీరాయి. పేదల, వృద్ధుల పింఛన్ వెయ్యి రూపాయలకు పెరిగింది. మూడవ శ్రేణి, నాల్గవ శ్రేణి ఉద్యోగాల నియామకానికి మోదీ ప్రభుత్వం ఇంటర్వ్యూ అవసరం లేకుండా చేసింది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలన్నీ పారదర్శక పద్ధతి అనుసరిస్తున్నాయి.

### త్వరితంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ

మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ విస్తరించడమే కాకుండా త్వరితగతిన విస్తరిస్తోంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు మునుపెన్నడూ లేనంతగా ఉన్నాయి. ఏడాదిలో సెన్సెక్స్ 31000 దాటింది. నిఫ్టీ కూడా రికార్డు స్థాయిలో పెరిగింది. 2014లో విద్యుత్తు అందుబాటులో ఉండడంలో భారత్ 99వ స్థానంలో ఉండేది. ఇప్పుడు 76 స్థానాలు పైకి ఎగబాకి 26వ స్థానంలో ఉంది. ఇది గొప్ప విజయం. పారిశ్రామికాభివృద్ధి రేటు 5 శాతం ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అంచనా ప్రకారం స్థూల జాతీయోత్పత్తి 7.2 శాతం ఉంది. యూపీఏ ప్రభుత్వం ముగిసే నాటికి ఇది కేవలం 4.8 శాతం మాత్రమే. వరసగా మూడేళ్లు వ్యవసాయాభివృద్ధి పెరిగింది. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ రంగం 4 శాతం అభివృద్ధి సాధిస్తోంది. అంతర్జాతీయ పోటీ సూచికలో 71వ స్థానంలో ఉన్న మన దేశం ప్రస్తుతం 39వ స్థానంలో ఉంది. మొదట ఎగుమతులు తక్కువగానే ఉన్నా ఇప్పుడు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చిలో ఎగుమతుల పెరుగుదల 27.6 శాతం ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 45 శాతం పెరిగాయి. వడ్డీ రేట్లు తగ్గించగలిగాం. ప్రత్యక్ష పన్నుల, పరోక్ష పన్నుల రాబడి 20 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో తలసరి వార్షిక ఆదాయం రూ. 93,293 ఉంటే ఇప్పుడు ఇది రూ. 1,03,007 కు పెరిగింది.

### నల్లధనంపై పోరాటం

గత మూడేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం నల్లధనానికి వ్యతిరేకంగా అనేక చర్యలు తీసుకుంది. పెద్దనోట్లు రద్దు చేసి నల్లధన నిర్మూలనకు నిబద్ధత చాటుకుంది. డొల్ల కంపెనీల మీద, బినామీ ఆస్తుల మీద చర్య తీసుకోవడం మోదీ ప్రభుత్వం నిర్ణయాత్మకమైన రీతిలో వ్యవహరించింది.

### బొగ్గు క్షేత్రాల వేలం ద్వారా కుంభకోణానికి చెల్లు

దాదాపు 15,000 కోట్ల రూపాయల విలువైన బినామీ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ ఆస్తులను అక్రమంగా సమకూర్చుకున్నారు. ఇది అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలన్న నిబద్ధతకు తార్కాణం. రకూ. 9.6 లక్షల కోట్ల విలువ గల అవినీతిని బయట పెట్టారు. సైప్రస్, సింగపూర్, మారిషస్ ద్వారా నల్ల డబ్బు మళ్లీ మన దేశంలోకి రావడాన్ని నిరోధించగలిగాం. రాజకీయ పార్టీలకు నగదు విరాళాలు రూ. 2000కు పరిమితం చేశారు. దీనివల్ల రాజకీయాల్లో నల్లధనం బెడద తగ్గుతుంది. పరిశుద్ధమైన రాజకీయాలకు అవకాశం కలుగుతుంది.

### రైతుల సంక్షేమానికి కట్టుబడ్డ ప్రభుత్వం

రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని అమిత్ షా చెప్పారు. రైతుల జీవన స్థాయి పెంపొందింప చేయడానికి భూసార కార్డులు, వేప పూత పూసిన యూరియా, ప్రధానమంత్రి సాగునీటి పథకం, ఇ–మండి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద పంట గిడ్డంగులకు చేరేదాకా భద్రత ఉంటుంది. వరసగా మూడేళ్లు రబీ, ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచారు. కనీస మద్దతు ధరకు పప్పు ధాన్యాలు కొనడం ద్వారా ఈ ధాన్యాలు పండించే వారికి ప్రభుత్వం బాసటగా నిలబడుతోంది. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతుల పరిస్థితి మెరుగుపడింది. ఆపత్కాలంలో రైతులను ఆదుకోవడానికి అన్ని ప్రమాణాలను పెంచారు. రైతులకు చెల్లించే కేటాయింపులు రెట్టింపయ్యాయి. చెరకు రైతులకూ బకాయిలు చెల్లించారు. వేపపూత పూసిన యూరియా వాడడం వల్ల క్రిమిసంహారక మందుల వాడకం తగ్గింది. దీనికి తోడు స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటి సారి రసాయనిక ఎరువుల ధరలు తగ్గాయి.

### మౌలిక సదుపాయాలలో మెరుగుదల

మోదీ హయాంలో జాతీయ రహదార్ల నిర్మాణం రికార్డు స్థాయిలో పెరుగుతోందని అమిత్ షా కొనియాడారు. జాతీయ రహదార్లను సుంకం లేనివిగా, క్రాసింగులు లేనివిగా చేసే ప్రయత్నం సాగుతోంది. జమ్మూ–కశ్మీర్‌లో అతి పెద్ద సొరంగ మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. ఇటీవలే అస్సాంను అరుణాచల్ ప్రదేశ్‌ను కలిపే భూపేన్ హజారికా వంతెనను మే 26న ప్రధాని ప్రారంభించారు. విద్యుదుత్పత్తి మూడింట ఒక వంతు, విద్యుత్ సరఫరా నాల్గింట ఒక వంతు పెరిగింది. రైల్వేల ఆధునీకరణకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడ్తున్నారు. మోదీ ప్రభుత్వం దాదాపు 30 కోట్ల ఎల్.ఇ.డి. బల్బులు పంపిణీ చేసింది. గత ఏడాది 28 లక్షల విదేశీ పర్యాటకులను ఆకర్షించగలిగాం. పర్యాటక రంగంలో 13 శాతం అభివృద్ధి కనిపించింది. గ్రామ సడక్ యోజన కింద రోజుకు 130 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం సాగుతోంది. చౌకగా విమాన ప్రయాణ సదుపాయం కల్పించారు. సాగరమాల పథకం ప్రారంభమైంది. నౌకాయానం కూడా మొదలైంది. అనేక దేశాలు మనతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

గృహ నిర్మాణానికి వడ్డీ రేట్లు తగ్గాయి. సొంత ఇంటి కల నెరవేరుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం తెలిసేది ఎన్నికలలోనే. 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి బిజెపి తన ఓట్ల శాతం ప్రతి ఎన్నికల్లోనూ పెంచుకోగలిగింది. అనేక ఎన్నికలలో విజయం సాధించింది. మోదీ ప్రభుత్వానికి దక్కిన గుర్తింపు ఇదే. ■



అనుభవాలతో పండిన ముఖబింబం పవిత్రమైన స్థలంలోని ప్రమిదలా వెలుగుతుంది. – బైరన్

విశ్లేషణ



# కుట్రపూరితంగా షహరాన్‌పూర్ ఘర్షణలు

• డా॥ రవీంద్ర అగర్వాల్

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో గంగా-యమున నదుల మధ్య ఉన్న షహరాన్‌పూర్ మామూలుగా అయితే చాలా ప్రశాంతంగా ఉంటుంది. కాని ఇప్పుడు షహరాన్‌పూర్ తప్పుడు కారణాల వల్ల వార్తల్లోకి ఎక్కుతోంది. గత నెల రోజులుగా కొనసాగుతున్న కుల కలహాల వంటి వాటిని ఆ జిల్లా ప్రజలు ఎన్నడూ చూడలేదు. మే 5, 9, 23, 24 తేదీల్లో జరిగిన కుల కలహాలను చూసి షహరాన్ పూర్ సరిహద్దుల్లో ఉన్న హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ప్రజలు విస్తుపోతున్నారు.

ఈ కలహాలు జరుగుతున్న సమీపంలోనే అక్కడికి దగ్గరగా ఉన్న మిర్జాపూర్‌లో ఇలాంటి ఆసక్తికర సంఘటన జరిగింది. ఆ గ్రామంలో కొంత మంది దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే రాజపుత్, దళిత వర్గాలకు చెందిన వారు వెంటనే మరో విగ్రహం ప్రతిష్ఠించారు. దీన్నిబట్టి రెండు వర్గాల వారు శాంతియుతంగా ఉండాలని అనుకుంటున్నారని అర్థం అవుతోంది. కాని షబ్బీర్‌పూర్ గ్రామంలో ఠాకూర్లు, దళితుల మధ్య ఘర్షణలు జరిగిన తర్వాత అమె 23వ తేదీన బీఎస్పీ నాయకురాలు మాయావతి ఆ గ్రామం సందర్శించి వెళ్లిన తర్వాత పరిస్థితి దిగజారింది. ఆమె ఆ గ్రామానికి రాక ముందే కొంత మంది దుండగులు రాజపుత్రుల ఇళ్ల మీద దాడి చేశారు. ఆమె ర్యాలీ ముగిసిన తర్వాత కుల ఘర్షణలు చెలరెగి దగ్గరలో ఉన్న చంద్‌పూర్ గ్రామానికి కూడా పాకాయి.

షరా మామూలుగానే ఈ ఘర్షణలన్నింటికీ బిజెపియే కారణమని మాయావతి ఆరోపించారు. కాని ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే ఇందులో బిజెపి పాత్రే లేదని స్పష్టం అవుతుంది. ఈ కులకలహాలకు షబ్బీర్‌పూర్ గ్రామం ప్రధాన కేంద్రంగా ఉంది. ఆ గ్రామంలో ఠాకూర్ల సంఖ్య ఎక్కువ. కాని గ్రామ సర్పంచ్ శివకుమార్ మాత్రం దళితుడు. అఖిలేశ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు నాలుగేళ్ల కింద సంత్ రవి దాస్ దేవాలయంలో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠించాలని దళితులు భావించారు. కాని జిల్లా యంత్రాంగం అనుమతించలేదు. కాని మాయావతి కాని, భీం సేన నాయకుడు చంద్రశేఖర్ గాని అప్పుడు విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని విమర్శించలేదు. కాని యూపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే విగ్రహ ప్రతిష్ఠాపన మళ్లీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వివాదాన్ని, దాని వెనక ఉన్న కుట్రను అర్థం చేసుకోవాలంటే ఘటనల క్రమాన్ని పరిశీలించాలి.

మే 5వ తేదీన రాజపుత్రులు పొరుగున ఉన్న షిలానా గ్రామంలో మహారాణా ప్రతాప్ ఉత్సవం నిర్వహించుకుంటున్నారు. ఆ ఊరేగింపు షబ్బీర్‌పూర్ గ్రామం గుండా వెళ్తున్నప్పుడు కొంతమంది యువకులు అంబేద్కర్ విగ్రహ వ్యవహారం ప్రస్తావించారు. ఇది కుల కలహాలకు దారి తీసింది.

**కులకలహాలకు షబ్బీర్‌పూర్ గ్రామం ప్రధాన కేంద్రంగా ఉంది. ఆ గ్రామంలో ఠాకూర్ల సంఖ్య ఎక్కువ. కాని గ్రామ సర్పంచ్ శివకుమార్ మాత్రం దళితుడు. అఖిలేశ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు నాలుగేళ్ల కింద సంత్ రవి దాస్ దేవాలయంలో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠించాలని దళితులు భావించారు. కాని జిల్లా యంత్రాంగం అనుమతించలేదు. కాని మాయావతి కాని, భీం సేన నాయకుడు చంద్రశేఖర్ గాని అప్పుడు విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని విమర్శించలేదు. కాని యూపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే విగ్రహ ప్రతిష్ఠాపన మళ్లీ ప్రాధాన్యత సంతరించుకుంది.**

మే 5న జరిగిన ఘటనలకు నిరసనగా షహరాన్‌పూర్‌లోని గాంధీ పార్కు వద్ద ప్రదర్శన ఏర్పాటు చేస్తామని భీం సేన అధిపతి చంద్రశేఖర్ మే 9న ప్రకటించారు. కాని జిల్లా పాలనా విభాగం ఆయనకు అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత షహరాన్‌పూర్ లో జరిగిన సంఘటనలు దిగ్భ్రాంతి కలిగించేవిగా ఉన్నాయి. షహరాన్‌పూర్‌కు వచ్చే రోడ్లన్నీ భీం సేన మద్దతుదార్లకు రణరంగాలుగా మారాయి.

మే 21న చంద్రశేఖర్ ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శన ఏర్పాటు చేశారు. జేఎన్‌యూ వివాదంలో అపఖ్యాతిపాలైన కణయా కుమార్, ఆయన బృందం కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ వినిపించిన నినాదాలు జేఎన్‌యూ ఉదంతాన్ని గుర్తుకు తెచ్చాయి. చంద్రశేఖర్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. సమాజం కోసం అవసరమైతే తాను నక్సలైట్‌గా మారడానికి సిద్ధమేనన్నారు. కాని ఈ మాట చెప్పేటప్పుడు ఆయన ఏ వ్యక్తి పేరుతో సంస్థను నెలకొల్పారో ఆ వ్యక్తి అంబేద్కర్ మాటలనే విస్మరించారు. అంబేద్కర్ విద్య అవసరాన్ని నొక్కి చెప్పారు కాని ఎన్నడూ హింసను ప్రోత్సహించలేదు.

మే 23న మాయావతి షబ్బీర్‌పూర్ గ్రామంలో ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆమె ర్యాలీ ముగిసిన తర్వాత మళ్లీ ఘర్షణలు చెలరేగాయి.

మే 25వ తేదీన ఎహ్సాన్‌వలి గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు ప్రదీప్ చౌహాన్‌పై కాల్పులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సూపరింటెండెంటును, జిల్లా మేజిస్ట్రేటును సస్పెండ్ చేసింది. మే 5 సంఘటన తర్వాత బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర మోళు అంబేద్కర్ హాస్టల్ దగ్గర ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. సమాజ్‌వాది పార్టీకి చెందిన కొందరు స్థానిక రాజపుత్రులు కూడా తమ యువకులను దళితుల మీదకు రెచ్చగొట్టారు.

దళిత ఓట్ల కోసం ప్రయత్నించే వారిలో భాగమైన భీం సేన మే 9న ఒక శక్తిగా అవతరించిందని గ్రహించాలి. అంతకు ముందు ఉత్తరప్రదేశ్ దళితులకు మాయావతి ఒక్కరే నాయకురాలు. 1996 నుంచి షహరాన్‌పూర్ బీఎస్పీకి కంచుకోటగా ఉంది. 1996లో, 2002లో మాయావతి హారోరా నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1996లో బిజెపి ఈ జిల్లాలో రెండు శాసనసభా స్థానాలు సాధిస్తే 2002లో నాలుగు స్థానాలు, 2007లో అయిదు స్థానాలు సాధించింది. కాని ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో కంచుకోట లాంటి చోట బీఎస్పీ కుదేలైంది. బిజెపి విజయం

అనుభవాలతో పండిన ముఖబింబం పవిత్రమైన స్థలంలోని ప్రమిదలా వెలుగుతుంది. - బైరన్




# దళితులను దగా చేసిన టీఆర్ఎస్

మూడు సంవత్సరాల టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిగా దారి మళ్లించారని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి దళితుడినే చేస్తానని... మాట ఇస్తే తల నరుక్కుంటానే తప్ప మాటతప్పనని చెప్పిన కె.చంద్రశేఖర్ రావు అధికారంలోకి వచ్చిన తరువాత తానే సీఎం సీటుపై కూర్చున్నారని విమర్శించారు. అబద్ధాలతో పరిపాలన సాగిస్తూ అతి పెద్ద అబద్ధాల ముఖ్యమంత్రిగా మారారని వ్యాఖ్యానించారు. వాల్మీకీ సమాజ్ ఆధ్వర్యంలో మే 27న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డా॥ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రస్తుతం మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. పేదల కోసమే పని చేస్తుందని స్పష్టం చేశారు. గావ్, గరీబ్, యువ, మహిళా, కార్మిక వర్గాల కోసం ఇతోధికంగా కృషి చేస్తూ 106 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల దళితులు, బీసీలంటూ మాట్లాడటం మొదలుపెట్టారని.. అయితే ఆయన మాటల్లో మతలబు మరో రకంగా ఉంటుందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల కోసం పోరాటం చేసి సాధించుకున్న సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి వారిని మోసం చేశారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీల ప్రయోజనాలను కాపాడకుండా దళిత వ్యతిరేకతతో ముందుకెళ్తుందని చెప్పారు. అనేక సంక్షేమ కార్యక్రమాల నిధులు దారిమళ్లుతున్నాయని తెలిపారు. దళితుల సంక్షేమం కోసం బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కేజీ టు పీజీ అని... మూడెకరాల భూమి అని... అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసిన కేసీఆర్‌కు దళిత వర్గాలు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు.

అమిత్ షా పర్యటనతో రాష్ట్రంలో అనేక మార్పులు సంభవించాయని, ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీగా బిజెపిని చూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. టీఆర్ఎస్ బలహీనమవుతుందని గ్రహించి సర్వే పేరిట ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తనే పరీక్ష రాసి తనే మార్కులు వేసుకున్నట్లుగా... ర్యాంకులు కూడా తనే ప్రకటించుకోవడం కేసీఆర్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. రెండు నెలల క్రితం కేసీఆర్ ప్రకటించిన సర్వే ఫలితాలకు... ప్రస్తుత సర్వే ఫలితాలకు తేడా గమనించాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి బంగారు శృతి, వాల్మీకీ సమాజ్ కన్వీనర్ సతీశ్ బిడ్లాన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగరాజు, ఎస్సీ మోర్చా నగర అధ్యక్షులు మాదరి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునీందర్, ధన్నారం నరహరి, ప్రవీణ్ బాగ్దే తదితరులు పాల్గొన్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

---

సాధించింది. కాంగ్రెస్‌కు రెండు స్థానాలు వచ్చాయి. సమాజ్‌వాది పార్టీకి ఒక్క స్థానం దక్కింది. అంతకుముందు 2014 లోక్‌సభ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీకి ఒక్క సీటు కూడా రాలేదు. అందువల్ల మాయావతి ప్రస్తుతం చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో ఉన్నారు.

ఇటీవలి శాసనసభ ఎన్నికల తర్వాత అనేక రంగాలలో మాయావతి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆమె పార్టీలోనే అలజడి ఉంది. తనకు కుడిభుజంగా ఉన్న నసీముద్దీన్ సిద్ధిఖీని మాయావతి పార్టీ నుంచి బహిష్కరించారు. తాజాగా భీం సేన ఆమె ఆధిపత్యాన్ని సవాలు చేస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే మే 23న షబ్బీర్‌పూర్ ర్యాలీలో సకల కార్యక్రమాలు బీఎస్పీ పేర మాత్రమే ఏర్పాటు చేయాలని ఆమె తన కార్యకర్తలను ఆదేశించారు.

ప్రస్తుతం షహరాన్‌పూర్‌లో జరిగిన హింసాకాండకు ఎదుటి వారి మీద నింద మోపే క్రమం కొనసాగుతోంది. కాని మహారాణా ప్రతాప్ దళితుల సహకారంతోనే మొగలుల మీద పోరాడారన్న వాస్తవాన్ని వీరు విస్మరించారు. సమాజంలో ఐక్యత లేకుండా ఎవరూ ఏమీ సాధించలేరు. ఏమైనప్పటికీ అక్కడ వీలైనంత త్వరగా పరిస్థితిని అదుపు చేయాలి. లేకపోతే కొద్ది రోజుల్లో అది పెద్ద సవాలుగా పరిణమించవచ్చు. కొంత మంది రహస్య ఎజెండాతో అక్కడ చేరారు. మొత్తం రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించే కుట్రలు పన్నుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసమర్థమైంది అని రుజువు చేయాలన్న ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రశాంతతను చెదరగొట్టడానికి కుట్ర జరుగుతోంది. ఇలాంటి వినాశకరమైన శక్తుల మీద కఠిన చర్య తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ

వర్తమానం

# సామాన్యుడికి ఊరటనిచ్చే జీఎస్టీ




డా॥ కె.రవీంద్ర
రిటైర్డ్ జాయింట్ కమిషనర్, కమర్షియల్ టాక్స్


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, 101వ రాజ్యాంగ సవరణ ద్వారా వస్తు సేవల పన్ను చట్టాన్ని తీసుకొచ్చింది. జీఎస్టీ దేశ పరోక్ష పన్నుల విధానంలో విప్లవాత్మకమైన, చారిత్రాత్మకమైన ఘట్టం.

వస్తువులు, సేవలపై విధించే ఈ పన్నును వస్తు సేవల పన్ను (జీఎస్టీ)గా పిలుస్తారు. వివిధ రకాల పన్నుల స్థానంలో దేశమంతా ఒకటే పన్ను విధానాన్ని అమల్లోకి తేవటానికి బిజెపి ప్రభుత్వం చేసిన ప్రయత్న ఫలితమే ఈ జీఎస్టీ చట్టం. రాష్ట్ర ప్రభుత్వం విధించే వ్యాట్, విలాస పన్ను, ప్రవేశ పన్ను/ఆక్ట్రాయ్, సెంట్రల్ సేల్స్ టాక్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం విధించే సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, సేవల పన్ను, కొన్ని అదనపు ఎక్సైజ్ డ్యూటీలు, సర్‌చార్జీలు, సెస్సులు తదితర ఎన్నో రకాల పన్నులు పోయి ఒకే ఒక వస్తు సేవల పన్ను అమల్లోకి వస్తుంది. దీంతో దేశమంతా ఒక వస్తువు, ఒక సర్వీసుపై ఒకే పన్ను ఉంటుంది. దీనినే ఏకీకృత పన్ను విధానం అంటారు.

ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతాలుగా పన్ను శ్లాబులను నిర్ణయించారు. అదనంగా జీరో, సిన్ టాక్సు కలిగిన వస్తు, సేవలంటాయి. ఏ వస్తువైనా, సేవ అయినా ఈ పన్ను శ్లాబు పరిధిలోకి రావలసిందే. జూలై 1 నుండి వస్తు సేవల పన్నులను అమలు చేయాలని దృఢ నిశ్చయంతో ఉన్న నేపథ్యంలో వివిధ వస్తువులు, సేవలపై జీఎస్టీ కౌన్సిల్ పన్ను రేట్లు నిర్ణయించింది.

### పన్ను లేని వస్తువులు, సేవలు:

పేదలకు, సామాన్యులకు ఊరట కలిగిస్తూ నిత్యావసర వస్తువులపై పన్ను మినహాయించారు. నిత్యం అవసరమయ్యే ఆహార ధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తులను పన్ను నుంచి పూర్తిగా మినహాయించారు. బియ్యం, గోధుమలు తదితర ఆహార ధాన్యాలు, పెరుగు, కోడిగుడ్లు, తేనే, కూరగాయలు, పండ్లు, గోధుమ పిండి, బెల్లం, మైదా, బ్రెడ్, ఉప్పు, కుంకుమ, గాజులు, ముద్రించిన పుస్తకాలు, చేనేత ఉత్పత్తులపై పన్ను ఉండదు. విద్య, వైద్య సేవలపైనా పన్ను పూర్తిగా మినహాయించారు. ఈ నిర్ణయం పేదలకు ఆహార భద్రత కలిగించేలా ఉంది.

### 5 శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్న వస్తు సేవలు:

మనం నిత్యం వినియోగించే వస్తువులు అయినప్పటికీ, తప్పనిసరిగా ఉపయోగించాల్సిన అవసరం లేని వస్తు సేవలపై 5 శాతం పన్ను విధించారు. చక్కర, కాఫీ, టీ, వంటనూనెలు, బొగ్గు, గొడుగులు, కిరోసిన్, ఎల్పీజీ, మసాలా దినుసులు, మందులు, స్టెంట్‌లు, పండ్ల రసాలు, చేతిపంపులు, ట్యూబులు, విమానం, రైలు, బస్సు టిక్కెట్లను 5 శాతం పన్ను శ్లాబులో ఉంచారు.

### 12 శాతం పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవలు:

నిత్యజీవితంలో తప్పనిసరిగా వినియోగించాల్సిన అవసరం లేనప్పటికీ ఎక్కువ శాతం ప్రజలు ఉపయోగించే వస్తుసేవలకు 12 శాతం విధించారు. వెన్న, నెయ్యి, మొబైల్ ఫోన్‌లు, జీడిపప్పు, బాదం పప్పు, అగరుబత్తీలు, ట్రాక్టర్లు, సైకిళ్లు, కళ్లద్దాలు, క్రీడాసామాగ్రి, పెన్ను, పెన్సిల్లు, పెయింటింగ్‌లు, ఆయుర్వేద మందులు, కుట్టుమిషీన్‌లు ఈ శ్లాబులోకి వస్తాయి.

సేవలలో నాన్ ఏసీ హోటల్స్, బిజినెస్ క్లాస్ విమాన ప్రయాణం మీద 12 శాతం పన్ను విధిస్తారు.

### 18 శాతం పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవలు:

అధికశాతం మధ్యతరగతి ప్రజలు ఉపయోగించే వస్తు సేవలపై 18 పన్ను శాతం విధించారు. అయితే వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ తొలగిస్తారు కాబట్టి ప్రస్తుం కన్నా పన్ను తక్కువగానే ఉంటుంది. హెయిర్ ఆయిల్స్, సబ్బులు, టూత్‌పేస్టులు, జామ్స్, ఐస్‌క్రీమ్స్, టాయిలెట్ పేపర్, ఇనుము, స్టీల్, మినరల్ వాటర్, కెమెరాలు, స్పీకర్‌లు, రెడీ టూ ఈట్ ఆహార ఉత్పత్తులు, యంత్ర సామాగ్రి, పరిశ్రమల్లో ఉపయోగించే వస్తువులు, హెల్మెట్లు, గడియారాలు, ఎలక్ట్రానిక్ బొమ్మలు, ఆయుధాలు మొదలగువాటికి ఈ శ్లాబులోకి వస్తాయి. సేవలలో ఏసీ రెస్టారెంట్స్, హోటళ్లు, బార్లు, టెలికాం, ఫైనాన్షియల్ సేవలపై 18 శాతం పన్ను ఉంటుంది.

### 28 శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్న వస్తు సేవలు:

విలాసవంతమైనవి, ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపై 28 శాతం పన్ను విధిస్తారు. కార్లు, మోటార్ సైకిళ్లు, సిమెంట్, చూయింగ్ గమ్, పాన్ మసాలా, షాంపూ, పెర్ఫ్యూమ్, షేవింగ్ క్రీమ్‌లు, హెయిర్ డై, ఏసీలు, ఫ్రిజ్‌లు, చాక్లెట్‌లు, సన్‌స్క్రీన్‌లు, పింగాణీ సామాగ్రి, పిస్టల్స్, ఫ్యాక్స్ మిషన్, రిస్ట్ వాచ్‌లు మొదలగునవి ఈ పన్ను శ్లాబులోనికి వస్తాయి.

రేస్ క్లబ్బుల్లో బెట్టింగ్‌లు, సినిమాలు, క్లబ్‌లు, స్టార్ హోటళ్ల మీద కూడా 28 శాతం సేవా పన్ను ఉంటుంది.

### సిన్ టాక్స్:

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులను 'సిన్ గూడ్స్' అంటారు. వీటిపై గరిష్టంగా వంద శాతం వరకు పన్ను ఉంటుంది. పొగాకు, పొగాకు ఉత్పత్తులపై 45 శాతం, శీతల పానీయాలపై 31.36 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు.

జీఎస్టీతో కొన్ని వస్తువులకు ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం బియ్యం, గోధుమలు తదితర వస్తువులపై వ్యాట్ పడుతుంది. జీఎస్టీ అమల్లోకి వస్తే వ్యాట్ తొలగిపోతుంది కాబట్టి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. చిన్నకార్లు, తక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లపై ప్రస్తుతంతో పోలిస్తే తక్కువ పన్ను పడనుండడంతో వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది.

సామాన్యుడి జీవన స్థితిగతుల ఆధారంగా జీఎస్టీ నిర్ణయించారు. ప్రజలు, ప్రభుత్వంతో పాటు వ్యాపార, వాణిజ్యవేత్తలకూ జీఎస్టీ మేలు చేయనుంది.

**(జీఎస్టీపై మీ సందేహాలు, అనుమానాలను ఫోన్: 94408 55555లో రచయితను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.)■**

మనిషి ఎన్నడూ తన గొప్పతనాన్ని ప్రదర్శించాలనే ఆలోచనకు తావివ్వకూడదు. - శ్రీ గురూజీ



# ప్రజలు కోరుకున్న తెలంగాణ బిజెపితోనే సాధ్యం



> నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తానని, అందరికీ రెండు పడక గదుల ఇళ్లు నిర్మిస్తామని, దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమి పంపిణీ చేస్తామని... ఇలా అనేక వాగ్దానాలు చేసిన టీఆర్ఎస్ అన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ఫిరాయింపులను ప్రోత్సహించి దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు.

జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రాష్ట్రంలో బిజెపి శ్రేణులు ఉత్సాహంగా ఈ వేడుకలు నిర్వహించాయి. రాజధాని హైదరాబాద్ నుంచి జిల్లాలు, మండలాల వరకు వాడవాడలా జాతీయ పతకాన్ని ఎగురవేశారు. మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ ఘట్టాలను మరోసారి నెమరు వేసుకున్నారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకున్నారు. ఏ లక్ష్యం కోసమైతే తెలంగాణ సాధించామో ఆ లక్ష్యం బిజెపితోనే నెరవేరుతుందని, వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేస్తామని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిన బూనారు.

బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలోనూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనేక త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో బిజెపి పాత్ర మరవలేనిదని అన్నారు. ఎటువంటి రాజకీయ ప్రయోజనాలు ఆశించకుండా, రాజకీయాలకు ముడి పెట్టకుండా, తెలంగాణ ప్రాంతంలో ఒక్క లోక్‌సభ సభ్యుడు లేకున్నా బిజెపి ఉద్యమాన్ని ముందుండి పతాక స్థాయికి తీసుకుపోయిందని గుర్తు చేశారు. నాటి బిజెపి జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంట్ ఉభయ సభల్లో సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అద్వానీ లాంటి మహామహా జాతీయ నాయకులు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చడానికి పార్లమెంట్‌ను సైతం స్తంభింపచేశారని తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్లమెంట్‌లో బిల్లు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఓ దశలో రాయల తెలంగాణ అంశాన్నీ కాంగ్రెస్ తీసుకొచ్చినా బిజెపి తీవ్రంగా వ్యతిరేకించిందని అన్నారు. రాయల తెలంగాణకు ఒప్పుకోకుండా పది జిల్లాలతో కూడిన తెలంగాణ కోసమే పట్టుబట్టిందన్నారు.



పార్టీలు వేరైనా, సిద్ధాంత వైరుధ్యాలున్నా, రాజకీయ జేఏసీతో, వివిధ సంఘాలతో కలిసి బిజెపి అసమాన పోరాటం చేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన అంశాలుగా ఉద్యమం కొనసాగిందని అన్నారు. స్వరాష్ట్రం సాకారమయ్యాక టీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు అనేకం ఇచ్చినా, ఆచరణలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తానని, అందరికీ రెండు పడక గదుల ఇళ్లు నిర్మిస్తామని, దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమి పంపిణీ చేస్తామని... ఇలా అనేక వాగ్దానాలు చేసిన టీఆర్ఎస్ అన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ఫిరాయింపులను ప్రోత్సహించి దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు.

ఏ ఆకాంక్షల కోసమైతే తెలంగాణ సాధించుకున్నామో ఆ దిశలో పరిపాలన సాగడం లేదని అన్నారు. స్వార్థపూరిత రాజకీయాలు కొనసాగిస్తూ, ఉద్యమకారులను, అమరవీరులను పక్కనపెట్టి, ఉద్యమ సమయంలో 'జై తెలంగాణ' అనని ద్రోహులను అందలమెక్కించారని మండిపడ్డారు. ఈ ద్రోహులకు పెద్దపీట వేస్తూ బంగారు తెలంగాణ అంటూంటే ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా రక్షిత మంచినీరు, మరుగుదొడ్ల గురించి మాట్లాడితే టీఆర్ఎస్ ఎదురుదాడి



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ

చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పునరాకృతితో అంచనాలు పెంచి కాంట్రాక్టుల జేబులు నింపే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.

లక్ష ఉద్యోగాల సంగతి దేవుడెరుగు... ఉన్న ఉద్యోగాలనూ టీఆర్ఎస్ ప్రభుత్వం తొలగిస్తుందని నిప్పులు చెరిగారు. 4వేల ప్రభుత్వ పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ఉన్న ఉపాధ్యాయులను తొలగించే ప్రయత్నం చేస్తుందని, మూడేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా 40వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయ నియామకాలు లేకుండా పేదలకు నాణ్యమైన విద్య ఏవిధంగా కల్పిస్తారని ప్రశ్నించారు. కేజీ టు పీజీ నిర్భంద ఉచిత విద్యను అటకెక్కించారన్నారు. కుటుంబ పాలనకు తెరదీశారని, రైతులు మద్దతు ధర కోసం ఆందోళన చేస్తే బేడీలు వేసి జైలుకు పంపారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు పతాక శీర్షికల్లో వస్తే సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నిస్తే అణచివేస్తుందని విమర్శించారు. నాడు తెలంగాణ సాధన కోసం ఉద్యమించినవారు నేటి టీఆర్ఎస్ పాలనను కోరుకోలేదని స్పష్టం చేశారు. ఏ తెలంగాణ కోసమైతే రాష్ట్రాన్ని సాధించుకున్నామో, సకల జనులు పోరాటం చేశారో అలాంటి ప్రజాస్వామ్య తెలంగాణను ఒక సంకల్పంతో కాపాడుకోవాల్సిన బాధ్యత బిజెపి కార్యకర్తలపై ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం అందరూ పాటు పడాలని డా॥ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సామాజిక, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం, అంకితభావంతో బిజెపి కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని కోరారు. నవ తెలంగాణ నిర్మాణ దిశగా అడుగులు వేయాలని, ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపి, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అటు మోదీ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చేసి, తెలంగాణ ప్రజల మన్ననలు పొందాలని బిజెపి నాయకులు, కార్యకర్తలకు డా॥ కె.లక్ష్మణ్ పిలుపు నిచ్చారు.

### ఆత్మపరిశీలన చేసుకోవాలి

ఏ రాష్ట్రం కోసం ఎంతోమంది ఆత్మబలి దానం చేశారో, అద్వితీయ పోరాటం చేశారో... ఆ తెలంగాణ ఉండా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బిజెపి కీలకపాత్ర పోషించిందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పార్టీ ఒకేబాటపై నిలబడి, నిరంతరం అంకితభావంతో పోరాటం చేశామని తెలిపారు. ఈ విషయం తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. సకల జనుల సమ్మెతో పాటు, వివిధ సంఘాలు చేసిన పోరాటంలో బిజెపి నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. త్యాగాల పునాదుల మీద అధికారంలోకొచ్చిన టీఆర్ఎస్ తెలంగాణ ద్రోహులకు పెద్దపీట వేసిందని విమర్శించారు. ఉద్యమంలో 'జై తెలంగాణ' అనని వ్యతిరేక శక్తులకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వం వహిస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలికగా అబద్ధాలాడడం, తిమ్మినిబమ్మిని చేస్తూ ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను మాట మీద నిలబడని సీఎం కేసీఆర్ పరిపాలించడం రాష్ట్ర ప్రజల దురదృష్టంగా అభివర్ణించారు. ఈ ప్రభుత్వం నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రాక్షసత్వం నుంచి విముక్తి పొందిన రోజును అధికారికంగా నిర్వహించడం లేదని దుయ్యబట్టారు. ఎంఐఎం ఒత్తిడికి తలొగ్గి కేసీఆర్ తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.



ఉద్యమంలో 'జై తెలంగాణ' అనని వ్యతిరేక శక్తులకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వం వహిస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలికగా అబద్ధాలాడడం, తిమ్మినిబమ్మిని చేస్తూ ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను మాట మీద నిలబడని సీఎం కేసీఆర్ పరిపాలించడం రాష్ట్ర ప్రజల దురదృష్టంగా అభివర్ణించారు.

### అమరవీరులకు నివాళులు

రాష్ట్ర కార్యాలయంలో జెండా ఎగురవేసిన అనంతరం బిజెపి నేతలు గన్‌పార్క్ వద్దనున్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలతో నివాళులు అర్పించారు. తొలిదశ ఉద్యమం, మలిదశ ఉద్యమంలో తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను మరోసారి నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు డా॥ నాగం జనార్ధన్ రెడ్డి, బిజెపి శాసనమండలి పక్షనేత ఎన్.రాంచందర్ రావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ టి.రాజేశ్వర్ రావు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహా యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు కృష్ణ సాగర్ రావు, పుష్పలీల, మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**

వర్తమానం

• కృష్ణ చైతన్య

# మియాపూర్ భూదందా: టీఆర్ఎస్ అవినీతికి ప్రత్యక్ష సాక్ష్యం



హైదరాబాద్‌లో భూ అక్రమణలు కోకొల్లలు. గతంలో పలువురు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు భూ ఆక్రమణలతోనే ప్రసిద్ధి చెందారు. అక్రమంగా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో ఆరితేరారు. వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో అయితే మరింతగా విజృంభించారు. రాయలసీమ ముఠా నాయకులు రాజకీయ నేతల అవతారం ఎత్తి హైదరాబాద్‌లో మకాం వేసి పెద్ద ఎత్తున భూములను ఆక్రమించుకున్నారు. అనేకమంది పేద, మధ్య తరగతి వర్గాల భూములను అక్రమంగా సొంతం చేసుకున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ కనిపించినా విచ్చలవిడిగా కబ్జా చేసుకున్నారు.

ఇప్పుడు ఉద్యమ పార్టీగా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు ప్రభుత్వం కూడా కాంగ్రెస్ అడుగు జాడల్లోనే నడుస్తున్నది. మియాపూర్‌లో వెలుగు చూసిన భూ దందా ఈ ప్రభుత్వంలో అంతులేని అవినీతికి ప్రత్యక్ష ఉదాహరణ సాధారణ కుంభకోణం కాదని, వేల కోట్ల రూపాయల కుంభకోణం అని తేలింది. మొత్తం 693.04 ఎకరాలను పక్కదారి పట్టించినట్లు ప్రస్తుతం గుర్తించారు. ఈ భూముల మళ్లింపు ద్వారా ప్రభుత్వానికి రూ.587.11 కోట్లు నష్టం వాటిల్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్లో ఈ స్కాం విలువ రూ.50వేల కోట్లపైనే ఉంటుందని అంచనా.

ఈ కుంభకోణంలో ఎవరెవరు ఉన్నారనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతానికి పోలీసులు సబ్‌రిజిస్ట్రార్ రాచకొండ శ్రీనివాస్ రావుతో పాటు ఇద్దరిని అరెస్టు చేశారు. భారీ అక్రమం వెనక మరికొందరు కీలక వ్యక్తులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే కేవలం ఒక సబ్‌రిజిస్ట్రార్ ఇంతటి అఘాయిత్యానికి పాల్పడతారా అనే అనుమానా లు కలుగుతున్నాయి. ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల ప్రమేయం లేకుండా ఇటువంటి కుంభకోణాలు జరగడం అసంభవం. ఒక మంత్రి పేషీ నుండే ఈ మొత్తం పక్రియ ప్రారంభమైనట్లు వార్తలు వచ్చాయి. ఒక సీనియర్ మంత్రికి ప్రతిఫలంగా రెండెకరాల భూమిని ఉచితంగా ఇచ్చారని, తామే ఖర్చులు భరించి ఆయన సూచించిన బినామీ పేరుతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, ఆ మంత్రి గారి పేషీలోని ఇద్దరు ఉద్యోగులు సాక్షి సంతకాలు చేశారని కూడా కథనాలు వెలువడ్డాయి.

ఈ మొత్తం వ్యవహారంపై ముఖ్యమంత్రి స్పందించిన తీరు మరిన్ని

## మియాపూర్ ల్యాండ్ స్కాం

- ☞ మియాపూర్ ల్యాండ్ స్కాం భారతదేశంలో అతిపెద్ద కుంభకోణం. చోటామోటా నేతల నుంచి సీఎం కేసీఆర్ వరకు ప్రభుత్వ పెద్దల ప్రమేయంపై అనుమానం?
- ☞ 50వేల కోట్ల భూ కుంభకోణంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీపై ఆధారాలు, రుజువులతో సహా తీవ్రమైన ఆరోపణలు.
- ☞ ఈ భూ దందాతో సీఎం కేసీఆర్ కు సంబంధం లేకుంటే ఎందుకు మౌనంగా ఉన్నట్టు..? మౌనం అంగీకారం అనుకోవాల్సి వస్తుంది.

శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లో భూముల ధర ఎకరం సుమారు రూ.14.5 కోట్లు పలుకుతోంది. దీంతో ఖాళీ స్థలాలపై అక్రమార్కులు దృష్టి పెట్టారు. ఎకరాకు దాదాపు రూ.2 కోట్లు ముడుపుల రూపంలో సమర్పించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నట్లు సమాచారం. మియాపూర్‌లోని 100, 101, 20, 28 సర్వే నెంబర్లలోని 693.04 ఎకరాల భూమిని దక్కించుకునే క్రమంలో రూ.వందల కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది.

ప్రముఖ స్థిరాస్తి వ్యాపార సంస్థలు ఈ కుంభకోణంలో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే ఆ స్థిరాస్తి అధిపతి నేరుగా ముఖ్యమంత్రికే సన్నిహితుడుగా భావిస్తున్నారు. అందుకనే ఈ కుంభకోణంలో దర్యాప్తు ముందుకు సాగే అవకాశాల పట్ల అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటి వరకు ఆ స్థిరాస్తి అధిపతిని పట్టుకోక పోవడం గమనార్హం. కూకట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ నేతృత్వంలో ఈ రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఆ శాఖతోపాటు, రెవెన్యూ శాఖలకు చెందిన పలువురి హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మియాపూర్ శరవేగంగా అభివృద్ధి



ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు ఫూలే

# సీఎం కేసీఆర్‌కు సూటి ప్రశ్నలు

- ☞ కోర్టు కేసులున్న అధికారులను రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కీలక స్థానాల్లో ఎందుకు నియమించినట్టు..?
- ☞ ఎనీ వేర్ రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు జరుగుతున్నట్టు ఏడాది క్రితమే రిపోర్టులు వస్తే కేసీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు.?
- ☞ నిషేధిత స్థలాల జాబితాను ఇంటర్నెట్‌లో పెట్టమని ఏడాది క్రితమే హైకోర్టు చెప్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఆ జాబితాను ఎందుకు రూపొందించలేదు.?
- ☞ పెద్ద చేపలను వదిలి చిన్నస్థాయి అధికారుల ట్రాన్స్‌ఫర్లను ఎందుకు ప్రహసనంగా మార్చారు..?
- ☞ మంత్రులు, అధికారులు తరచుగా విదేశాల్లో తిరుగుతూ ఉంటే సీఎం కేసీఆర్ ఎందుకు గుర్తించలేదు? దీనిపై ఎందుకు విచారణ జరిపించలేదు..?
- ☞ చిన్న చిన్న అధికారులను తప్పిస్తే ఒక్క ఐఏఎస్ అధికారిని కూడా సస్పెండ్ చేయకపోవడం దేనికి నిదర్శనం?
- ☞ మంత్రి నివాసంలో పనిచేసే ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా సంతకం చేస్తే ప్రభుత్వ ప్రమేయం లేదని ఎలా అనుకోవాలి?
- ☞ గోల్డ్ స్టోన్ ప్రసాద్ రాత్రికిరాత్రి ఎలా పారిపోయారు..? ఆయనను ఎందుకు వెంటనే అరెస్టు చేయలేదు..? ఈ స్కాంలో ఆయనకు ఎవరితో సంబంధం ఉంది..?

## బిజెపి డిమాండ్లు

- ☞ ఈ స్కాంపై సీఎం కేసీఆర్ 24 గంటల్లో వివరణ ఇవ్వాలి. సమగ్ర విచారణ జరిపించాలి.
- ☞ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీని పదవి నుంచి తొలగించాలి.
- ☞ ఈ భూ కుంభకోణంపై సీఎం కేసీఆర్ కేంద్ర స్థాయి దర్యాప్తునకు ఆదేశించి చిత్తశుద్ధి చాటుకోవాలి.

చెందుతుండడంతో పాటు సమీపంలోనే మెట్రో రైలు డిపో రావడంతో భూముల ధర విపరీతంగా పెరిగిపోతోంది. ఇందులో భాగంగానే అక్రమం బయటకు పొక్కకుండా తెలివిగా బుక్-2 కింద చూపి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది.


మియాపూర్ భూ కుంభకోణం అంతా పక్కా వ్యూహం ప్రకారం జరిగినట్లు అర్థం అవుతున్నది. ఈ కుంభకోణం బయట పడిన తరువాత హడావుడిగా అధికారుల బదిలీల్లో భారీఎత్తున అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది. ఏకంగా ఏసీబీ కేసులు ఉన్నవారికి కీలక చోట్లలో పోస్టింగ్‌లు ఇచ్చేశారు. రాత్రికిరాత్రే జరిగిన ఈ బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు కనబడుతుంది. బదిలీల్లో కీలక పోస్టింగ్‌లు ఇచ్చిన వారిలో కొందరు అధికారులు ఏసీబీ అభియోగాలు ఎదుర్కొన్నవారే. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ ఇచ్చిన వెంకట రమణపై గతంలో ఏసీబీ కేసు నమోదైంది. అలాగే సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ వనజ కుమారి కూడా ఏసీబీకి చిక్కినవారే. చాలాకాలంగా ఒకేచోట పనిచేస్తున్నవారినీ బదిలీ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కానీ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

కోదాడలో ఆరేళ్లుగా పనిచేస్తున్న సుధారాం నాయక్ జోలికి వెళ్లలేదు. ఇదే సమయంలో హుజూర్‌నగర్‌లో మూడేళ్లుగా పనిచేస్తున్న విజయ్‌ను మేడ్చల్ జిల్లా వల్లభనగర్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. అదే చోట మరో విభాగంలో పనిచేస్తున్న అధికారికి అక్కడే సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్ ఇచ్చారు. మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌గా పనిచేస్తున్న మహ్మద్ సలీమ్‌ను అక్కడే సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్ ఇచ్చారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి సూపరిం టెండెంట్ మురళీధరన్‌ను మల్కాజ్‌గిరిలోనే సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ గౌస్‌బాబా సంగారెడ్డిలోనే సబ్ రిజిస్ట్రార్-1గా నియమితులయ్యారు.

మొత్తంగా బదిలీలన్నీ తూతూమంత్రంగానే జరిగినట్లుగా తెలుస్తోంది. ఎక్కువమందిని హైదరాబాద్ పరిధికే పరిమితం చేశారు. మరి కొంతమందిని పక్కపక్క జిల్లాలకే బదిలీలు చేశారు. ఇక ఈ సందర్భంగా పెద్ద ఎత్తున జరిగిన ఏసీబీ దాడులు సైతం అసలు కుంభకోణం నుండి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే అని భావించాల్సి వస్తున్నది. ■




అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మే 29న బిజెపి నేతలు కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కేంద్ర నిధుల వివరాలు చెప్పలేక తోక ముడిచిన కేసీఆర్

• ప్రవీణ్

మరో రెండేళ్లలో ఎన్నికలు జరుగనున్న సందర్భంగా బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మూడు రోజుల తెలంగాణ పర్యటన విశేష ప్రాధాన్యత సంతరించుకొంది. ఊహించినదాని కన్నా ఎక్కువగా ఈ పర్యటనకు ప్రజల ఆదరణ లభించడంతో అసహనంతో తన హోదా, స్థాయి మరచిపోయి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అసభ్య పదజాలంతో కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ అధ్యక్షుడిపై విరుచుకుపడటం విచారకరం. రాజకీయాలలో బేధాభిప్రాయాలు ఉండవచ్చు, రాజకీయ పక్షాల మధ్య వైరం ఉండవచ్చు. కానీ వ్యక్తిగతంగా ఎటువంటి కారణం లేకుండా, రెచ్చగొట్టిన సందర్భం కూడా లేకుండా ఈ విధంగా అవాకులు, చవాకులు పేలడం రాజకీయ వర్గాలలో అందరికి ఆశ్చర్యం కలిగించింది.

అమిత్ షా తెలంగాణ రాష్ట్రాన్ని అవమాన పరచారని, అందుకనే తట్టుకోలేకపోతున్నానంటూ సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. అయితే అమిత్ షా ఎక్కడా తెలంగాణ రాష్ట్రాన్ని గాని, రాష్ట్ర ప్రజలను గాని పరోక్షంగా కూడా కించ పరచే విధంగా ఎటువంటి వ్యాఖ్య చేయలేదు. ఆయన అసలు బహిరంగ సభలలోనే ప్రసంగించ లేదు. కేవలం పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశాలకు పరిమితం అయ్యారు. 2019 ఎన్నికలకు సిద్ధపడటం కోసం ఏ విధంగా సమాయత్తం కావాలో మార్గదర్శనం చేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత మూడేళ్ళుగా విశేషంగా కృషి చేస్తున్నదని, పెద్ద ఎత్తున నిధులను సమకూరుస్తున్నదని తెలిపారు. ఈ నిధుల వివరాలను, చేస్తున్న కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజలకు వివరించామని ఉద్బోధించారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఆ నిధులు, వివిధ కేంద్ర పథకాల వివరాలు తెలుపమని దిశానిర్దేశం చేయారు. అంత మాత్రం చేతనే కేసీఆర్ సివంగి వలే అంతగా రెచ్చి పోవడానికి కారణం కనిపించడం లేదు.

వాస్తవానికి తెలంగాణలో తన ప్రభుత్వం రోజురోజుకు ప్రజల మద్దతు కోల్పోతూ బిజెపికి ఆదరణ పెరగడంతోనే ఆయన అంతగా ఆక్రోశం చెందినట్లు కనిపిస్తోంది. అక్టోబర్ చివరి వారంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం శతజయంతి ఉత్సవాలలో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సమక్షంలో విద్యార్థులు తనను మాట్లాడనీయకపోవడాన్ని తమాయించుకోలేక పోతున్నారు.

ఆ మరుసటి రోజే టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో భారీ సన్నాహాలతో జరిపిన పార్టీ బహిరంగ సభ చాలా పేలవంగా జరగడం, ప్రజల నుండి చెప్పుకోదగిన స్పందన లేక పోవడంతో ముఖ్యమంత్రి ఢీలా పడిపోయారు. అందుకనే సభలో అరగంట సేపు కూడా మాట్లాడలేక హడావుడిగా తన ప్రసంగాన్ని ముగించుకు వచ్చారు. రోజురోజుకు రాష్ట్రంలో అధికార పక్షం గ్రాఫ్ తగ్గిపోతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో 111 సీట్లు గెలుచు కుంటామని, బిజెపి, కాంగ్రెస్‌లకు ఒక్క సీట్ కూడా రాదంటూ 'అంతర్గత నివేదిక'ను పార్టీ సమావేశం ముందు ఉంచినా, అదంతా కేవలం మేకపోతు గాంభీర్యంతో నాయకుల మనోస్థైర్యం నింపడం కోసమే అని అందరికి తెలిసిందే. నిజంగా అంత ధైర్యం ఉంటే ప్రతిపక్ష సభ్యులను రాజీనామా చేసి మళ్లీ గెలవమని సవాల్ చేసే బదులు పార్టీ ఫిరాయించి టీఆర్ఎస్‌లో చట్ట వ్యతిరేకంగా కొనసాగుతున్న వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు సిద్ధ పడవచ్చు గదా? అప్పుడే ఎవరి బలం ఎంతో తేలిపోతుంది గదా? ప్రజలను ఎదుర్కొనే ధైర్యం కేసీఆర్ ప్రభుత్వంలో కనిపించడం లేదు.

టీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నట్లు గ్రహించే కేసీఆర్.. అమిత్ షా పర్యటనపై అక్కసు వెళ్లగక్కారు. తెలంగాణకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లక్ష కోట్ల రూపాయల నిధులు ఇచ్చామని అమిత్ షా చెప్పడాన్ని సహించలేక పోయారు. అమిత్ షా హైదరాబాద్‌లో ఉండగానే రూ.68 వేల కోట్లకు మించి కేంద్ర నిధులు రాలేదంటూ పొంతనలేని పాటలు మాట్లాడారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ తన మాటకు కట్టుబడి ఉన్నానని అమిత్ షా స్పష్టం చేశారు. ఆ మరుసటి రోజు కూడా ఢిల్లీలో అదే మాట చెప్పారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తమకు వచ్చిన నిధుల వివరాలు చెబితే మిగిలిన వివరాలు తాను ఇస్తానని కూడా స్పష్టం చేశారు.

లక్ష కోట్ల రూపాయల నిధులు కేంద్రం నుండి వచ్చినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి అమిత్ షా ఈ మాటలు అన్న తరువాత మౌనం వహించారు. సమాధానం చెప్పలేక అమిత్ షా హైదరాబాద్ నుండి వెళ్లిపోయారంటూ మంత్రి టి.హరీష్ రావు, మరి కొందరు చౌకబారుగా ప్రకటనలు చేసినా కేంద్రం నుండి వచ్చిన నిధుల వివరాలు చెప్పే సాహసం రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు. దీనిపై రాష్ట్ర శాసనసభలో గాని, మరే వేదికమీద అయినా సరే బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నాంటూ తెలంగాణ బిజెపి అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ సవాల్ చేశారు. ఆ సవాల్‌కు కూడా ప్రభుత్వం నుండి సమాధానం లేదు.

తన వద్ద కేంద్రం నుండి రూ.1.50 లక్షల కోట్ల మేరకు నిధుల వివరాలు ఉన్నాయని సీనియర్ బిజెపి నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ వర్గాల కథనాల మేరకు రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు సమకూరినట్లు తెలుస్తున్నది. అందుకనే తోక ముడిచినట్లు మారు మాట్లాడకుండా కేసీఆర్ మౌనం వహిస్తున్నారు. కేంద్రం నుండి సమకూరిన నిధుల విషయంలో గతంలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు రాష్ట్ర శాసనసభలో చేసిన ప్రకటనలకు, పలువురు మంత్రులు వివిధ సందర్భాలలో చేసిన ప్రకటనలకు అమిత్ షా పర్యటన సందర్భంగా చేసిన ప్రకటనకు అసలు పొంతన లేదు. ఉదాహరణకు రాష్ట్రంలో రహదారుల కోసం రూ.2,000 కోట్లు మాత్రమే కేంద్రం నుండి



నిరుత్సాహపడితే దైవం కూడా వ్యతిరేకిస్తుంది. – ఆచార్య చాణక్యుడు




# సీఎంకు ఇంద్రసేనా రెడ్డి సవాల్

తెలంగాణ అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధులు ఇచ్చినట్టు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పడాన్ని తెలంగాణను అవమాన పరచినట్లుగా అభివర్ణించి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హోదాను మరచి అసభ్యంగా దుర్భాషలాడడంపై బిజెపి సీనియర్ నేత ఎన్.ఇంద్రసేనా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా ఎక్కడా తెలంగాణను గాని, రాష్ట్ర ప్రజలను గాని పరోక్షంగా కూడా అవమానపరచే విధంగా ఎటువంటి వ్యాఖ్య చేయలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం ఇస్తున్న నిధులు క్షేత్ర స్థాయికి వెళ్లడం లేదని, పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఆ నిధులు, వివిధ కేంద్ర పథకాల వివరాలు తెలుపమని మాత్రమే చెప్పారని గుర్తు చేశారు.

ఉస్మానియా శతజయంతి ఉత్సవాలలో సీఎంను మాట్లాడనీయకపోవడం, ఆ మరుసటి రోజు వరంగల్ టీఆర్ఎస్ బహిరంగ సభ పేలవంగా జరగడం, మరో వంక రోజురోజుకు రాష్ట్రంలో అధికార పక్షం గ్రాఫ్ తగ్గిపోతున్నట్టు నివేదికలు రావడంతో కేసీఆర్ అసహనంతో స్థిమితం కోల్పోయారని విమర్శించారు.

గత మూడేళ్ళలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద తెలంగాణకు లక్ష కోట్ల రూపాయలకు మించే కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చెబుతున్నట్టు కేంద్రం నుండి వచ్చిన రూ.68 వేల కోట్ల నిధుల వివరాలు ముందుగా బయట పెట్టాలని ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. తమ వద్ద లక్ష 50వేల కోట్ల రూపాయల వరకు కేంద్రం నుండి వచ్చిన నిధుల వివరాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కేసీఆర్ వివరాలు బయట పెట్టలేని పక్షంలో తామే రాష్ట్ర ప్రభుత్వ అధికార వివరాలని బయట పెట్టగలమని సవాల్ చేశారు.

**ముఖ్యమంత్రి చెబుతున్నట్టు కేంద్రం నుండి వచ్చిన రూ.68 వేల కోట్ల నిధుల వివరాలు ముందుగా బయట పెట్టాలని ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. తమ వద్ద లక్ష 50వేల కోట్ల రూపాయల వరకు కేంద్రం నుండి వచ్చిన నిధుల వివరాలు ఉన్నాయని స్పష్టం చేశారు.**

1997లోనే కాకినాడలో బిజెపి తెలంగాణ కోసం తీర్మానం చేసినప్పుడు కేసీఆర్ ఎక్కడ ఉన్నారని ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. అప్పుడు మంత్రి పదవిలో ఉండి తెలంగాణ గురించి మాట్లాడలేదని, ఆ తరువాత మంత్రి పదవి పోవడంతో తెలంగాణ ఉద్యమం ఎత్తుకున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా ఒక్క రోజు కూడా కేసీఆర్ జైలుకు వెళ్లలేదని, ఆయన చేసిన నిరాహార దీక్ష బూటకం అని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ ఆడిన నాటకాలు అన్నింటిని పొట్టలో పెట్టుకొని ఇప్పటి వరకు కాపాడామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని దేశంలో మొదట తీర్మానం చేసిన పార్టీ బిజెపి అని, బిజెపి జాతీయ స్థాయిలో నిర్ణయం తీసుకున్న తరువాతే గత్యంతరం లేక కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వవలసి వచ్చిందని అన్నారు.

తెలంగాణలో ఉన్న సుమారు 1200 కేంద్ర సంస్థలకు రూ.50 లక్షల నుండి రూ.50 కోట్ల వరకు సుమారు రూ.1300 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. అట్లాగే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు, పెన్షన్‌కు, ప్రజా పంపిణీకి... నిధులను కేంద్రం సమకూర్చినదని అన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ రెండో యూనిట్.. తదితర వివరాలను కేసీఆర్ లెక్కలో చూపలేదని వేలెత్తి చూపారు.

రాష్ట్ర మంత్రులు టి.హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర రావు పలు సందర్భాలలో కేంద్రం నుండి వచ్చిన వేల కోట్ల రూపాయల వరకు మీడియా వారికి వివరించారని తెలిపారు. ధైర్యం ఉంటే కేంద్రం నుండి ఏ ఏ నిధులు వచ్చాయో వాటి వివరాలను కేసీఆర్ బయట పెట్టాలని ఇంద్రసేనారెడ్డి సవాల్ చేశారు. లేని పక్షంలో అబద్దాలను వల్లెవేస్తున్న కేసీఆర్‌కు తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

---

వచ్చాయని ఇప్పుడు కేసీఆర్ చెబుతున్నారు. కొద్దీ నెలల క్రితం కేసీఆర్ స్వయంగా రాష్ట్ర శాసనసభలో కేంద్రం నుండి రహదారుల కోసం రూ.12 వేల కోట్లు సమకూరాయంటూ చెప్పారు. గత 60 ఏళ్ళల్లో తెలంగాణలో వేసిన మొత్తం రోడ్ల కన్నా ఈ మూడేళ్లల్లో ఎక్కువ రోడ్లు నిర్మిస్తున్నామని కూడా గర్వంగా చెప్పుకొన్నారు. అందుకు ఉదారంగా నిధులు సమకూర్చి సహకరిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని అభినందిస్తూ ఆయనే స్వయంగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ విషయాన్నీ ముఖ్యమంత్రి మరచి పోయారా..?

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా బహిరంగ సభలో ఇంతకుముందు తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన విద్యుత్ కోతలు ఎదుర్కొంటూ ఉండేదని, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సహకారంతో విద్యుత్ సమస్యను అధిగమించామని ప్రధాని సమక్షంలోనే ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పుడేమో రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ సమస్యను కష్టపడి పరిష్కరించుకొందని, ఇందులో కేంద్రం చేసింది ఏమీ లేదని బుకాయిస్తున్నారు. పైగా, హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర రావు వంటి రాష్ట్ర మంత్రులు పలు సందర్భాలలో కేంద్రం నుండి వచ్చిన వేల కోట్ల రూపాయల నిధులను మీడియా వారికి వివరించారు. ఇప్పుడు కేంద్రం నుండి ప్రత్యేకంగా నిధులు ఏవీ రావడం లేదని, కేవలం రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి ఇవ్వవలసిన నిధులే వస్తున్నాయని అంటున్నారు.

దేశంలో గుజరాత్ తరువాత తమదే సంపన్న రాష్ట్రం అని, మిగులు రాష్ట్రం అని ముఖ్యమంత్రి తరచూ చెప్పుకొంటున్నా ఈ ప్రభుత్వం ప్రతిష్ఠాకర పథకాలు అని చెప్పుకొంటున్న ఒక పథకానికి కూడా బడ్జెట్‌లో ఎటువంటి ప్రత్యేక నిధులు సమకూరడం లేదు. ఈ ప్రభుత్వం అమలు జరుపుతున్న దాదాపు అన్ని సంక్షేమ పథకాలకు కేంద్రం నుండి వివిధ రూపాలలో వస్తున్న నిధులు గాని, ఆర్థిక సంస్థల నుండి సమకూర్చుకొంటున్న రుణాలు తప్ప బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధులు ఉండటం లేదని గమనించాలి. ■




# టీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం

యుద్ధం ప్రారంభం కాకముందే అస్త్ర సన్యాసం చేసిన మాదిరిగా, రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు రాకముందే కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. ఎన్నికలలో గెలవలేమనే విషయం అర్థం కావడంతోనే కాంగ్రెస్ ఇతర పార్టీలతో పొత్తుకు వెంపర్లాడుతుందని విమర్శించారు.

హైదరాబాద్ అంబర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో డా॥ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో గాని, రాష్ట్రంలోగాని కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరని, వారి దోపిడీ, అవినీతిని ప్రజలు మరవలేదని అన్నారు. జైపాల్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు పొత్తుల గురించి.. అదీ బద్ధ శత్రువైన తెలుగుదేశం, కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు గురించి మాట్లాడటం, రాష్ట్ర కాంగ్రెస్ దీనస్థితిని, దివాళాకోరుతనాన్ని ఎండగడుతుంది అన్నారు. కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నప్పటికీ, ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో కూడా పునరావృతమవుతాయని జోస్యం చెప్పారు. ప్రాంతీయ, కుటుంబ పార్టీ టీఆర్ఎస్ గద్దె దిగాల్సిన పరిస్థితులు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ నామమాత్రంగా మిగులుతుందని, మోదీ నాయకత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చి తీరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

టీఆర్ఎస్, బిజెపి లాలూచీ అని, 2019లో కలుస్తాయని జైపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని విమర్శించారు. బిజెపి ఒంటరిగా పోటీచేసి అధికారంలోకి వస్తుందని డా॥ లక్ష్మణ్ అన్నారు. లాలూచీ కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకే చెల్లుతాయని, గతంలో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయని, అధికారంలోకి వచ్చి ప్రభుత్వంలో భాగస్వాములయ్యాయని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్ర మంత్రి హరీష్‌రావు లెక్కలు సరిచూసుకోవాలని, రూ. 67 వేల కోట్లు కేంద్రం ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వమే స్పష్టం చేసిందనీ, రూ. 41 వేల కోట్లు రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి కేంద్రం ఇచ్చినట్లు 'జాతీయ రోడ్డు కాంగ్రెస్ సమావేశం'లో ముఖ్యమంత్రి స్వయంగా తెలిపారని, ఈ రెండూ కలిపినా కేంద్ర సహాయం లక్ష కోట్లు దాటిందని తెలిపారు. కేంద్ర నిధులను సక్రమంగా ఖర్చు చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, టీఆర్ఎస్ అసమర్థత వల్ల గత సంవత్సరం రూ. 3800 కోట్ల కేంద్ర నిధులు వెనక్కుపోయాయని విమర్శించారు.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో, 3 సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో బీసీలు మరింత వెనకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు ప్రభుత్వాలు బీసీలకు చేసిందేమీ లేదని, బీసీల సమస్యల పరిష్కారానికై ప్రజాపోరాటం ఉధృతం చేయాలని డా॥ లక్ష్మణ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గానికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మత ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. బీసీలు 'యాచించే స్థితినుండి శాసించే స్థితికి' ఎదగాలని అభిలషించారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, స్కిల్ ఇండియా, ముద్రాబ్యాంకు, బలహీన వర్గాలకు ఇండ్ల మంజూరు వంటివి చేపడుతుందని తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధత కల్పించిందని తెలిపారు. ఆగస్టు నెలలో పెద్దఎత్తున బీసీ సదస్సు నిర్వహిస్తుందన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహా యాదవ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మోర్చా ఇంచార్జ్ డా॥ కాసం వెంకటేశ్వర్లు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి డా॥ ప్రేమ్‌రాజ్ యాదవ్, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకట రాములు, అనంతుల రవీందర్, ఎస్.ఆంజనేయులు, బిజెపి మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ వజ్జ తదితరులు పాల్గొన్నారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. - షేక్స్పియర్